తెలంగాణ TELANGANA MUCHATLU



ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | మంగళవారం - 24 - నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 170 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



గ్లోబల్ సమిట్ ఏర్పాట్లలో నిర్లక్ష్యం సహించేది లేదు

- *ప్రతినిధులకు అత్యుత్తమ ఆతిథ్యం అందించాలి :సీఎం రేవంత్*
- *ఫేషియల్ రికగ్నిషన్‌తో ప్రవేశానికి ఏర్పాట్లు*
- *విమానాశ్రయం నుంచి తిరుగు ప్రయాణం వరకు ప్రత్యేక పర్యవేక్షణ*
- *తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా సమిట్ ప్రాంగణం*

హైదరాబాద్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ గ్లోబల్ సమిట్ -2026కు హాజరయ్యే దేశ, విదేశీ ప్రతినిధుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమిట్ నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా ప్రతి అంశాన్ని ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. సోమవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమ ఏర్పాట్లు, ప్రతినిధులకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రత, రవాణా, ఆతిథ్యం, వివిధ విభాగాల మధ్య సమన్వయం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. విధుల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అంతర్జాతీయ స్థాయి ప్రతిష్ఠకు అనుగుణంగా సమిట్ నిర్వహణ ఉండాలని, ప్రతి విభాగం తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. గ్లోబల్ సమిట్‌కు వచ్చే ప్రతినిధులకు ప్రవేశం కల్పించే ప్రక్రియను సులభతరం చేయడంతోపాటు భద్రతాపరంగా పటిష్ఠంగా ఉండేలా ఫేషియల్ రికగ్నిషన్ విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. సమిట్‌కు హాజరయ్యే డెలిగేట్లతో విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది అత్యంత మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా ముందుగానే శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రతినిధులకు అవసరమైన ఆహార సదుపాయాల కోసం ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయాలని, నిరంతరాయంగా మెరుగైన ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. దేశ, విదేశాల నుంచి వచ్చే అతిథులకు విమానాశ్రయంలో దిగినప్పటి నుంచి సమిట్ కార్యక్రమాలు ముగించుకుని తిరిగి వెళ్లే వరకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక లైజనింగ్ ఆఫీసర్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రతినిధుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించే బాధ్యతను సంబంధిత అధికారులు తీసుకోవాలని సూచించారు. గ్లోబల్ సమిట్ ఏర్పాట్లలో తెలంగాణ సంస్కృతి,

మిగతా 2 లో..



తెలంగాణలో

అవినీతి పాలన సాగుతుంది

- *కరీంనగర్ మహా పాదయాత్రలో నితిన్ నబీన్*
- *రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడి విమర్శలు*
- *వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయమన్న బండి సంజయ్*



కరీంనగర్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):

కరీంనగర్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ మహా పాదయాత్రలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. రాహుల్‌గాంధీ విదేశాలకు వెళ్లి దేశ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో ఉందంటూ విదేశాల్లో వ్యాఖ్యానించడం సరికాదని, దేశాభివృద్ధి గురించి ఆలోచించకుండా తన కుటుంబ అభివృద్ధిపైనే రాహుల్ దృష్టి పెట్టారని విమర్శించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీకి ఏటీఎంలా పనిచేస్తున్నారని ఆరోపించారు. కరీంనగర్‌లో ప్రజల నుంచి లభించిన స్పందన బీజేపీకి ఉన్న ఆదరణకు నిదర్శనమని పేర్కొంటూ, కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రతిపక్ష ఇండియా కూటమి అనవసర రాద్ధాంతం చేస్తోందని

మిగతా 2 లో..



ప్రభుత్వ భూముల వేలాన్ని నిలిపివేయాలి

- *హుడా ట్రక్ పార్కింగ్ భూముల వేలంపై బీజేపీ ధర్నా*
- *సంగీత్ నగర్‌లో నిరసనకు ఎంపీ ఈటల మద్దతు*
- *పేదల అసైన్డ్ భూములను కాపాడాలని డిమాండ్*
- *ప్రభుత్వ భూముల అమ్మకాలపై సర్కారుకు ప్రశ్నలు*

హైదరాబాద్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గం సంగీత్ నగర్‌లో హుడా (హెచ్‌యూడీఏ) ట్రక్ పార్కింగ్ భూముల వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని నిరసనకు మద్దతు తెలిపారు. ప్రజావసరాల కోసం కేటాయించిన భూములను, పేదలకు గతంలో అసైన్ చేసిన భూములను వేలం వేయాలన్న నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల అవసరాల కోసం భూములను సేకరించడం ప్రభుత్వాల బాధ్యత అని, కానీ ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారంలా విక్రయిస్తోందని ఈటల విమర్శించారు. భూములు అమ్మి ప్రభుత్వ ఖర్చులు, ఉద్యోగుల జీతభత్యాలు చెల్లించాలనే ఆలోచన సరైనది కాదన్నారు. ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్తులో హైదరాబాద్‌లో ప్రజా అవసరాలకు ఉపయోగపడే భూములు

మిగతా 2 లో..



ఏసీబీ డైరెక్టర్‌గా ఎస్. చంద్రశేఖర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

- *నవంబర్ 23న పదవీ బాధ్యతలు చేపట్టిన ఐపీఎస్ అధికారి*
- *హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో బాధ్యతల స్వీకారం*
- *తెలంగాణ అవినీతి నిరోధక శాఖకు నూతన డైరెక్టర్*

2 లో..

కార్యకర్తల త్యాగాలతోనే
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

- *కాంగ్రెస్ శ్రేణులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాలి*
- *పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం*
- *రెండోసారి అధికారంలోకి రావడమే లక్ష్యం*
- *గాంధీభవన్‌తో భావోద్వేగ అనుబంధం ఉంది: ఉత్తమ్*

హైదరాబాద్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): కాంగ్రెస్ కార్యకర్తల కష్టం, త్యాగాల ఫలితంగానే తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చిందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల టీడీపీ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. పార్టీ కోసం దీర్ఘకాలంగా కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారికి న్యాయం జరగాలని, వారి సేవలను నాయకత్వం గుర్తించాలని

మిగతా 2 లో..



జాతీయ రహదారిపై దగ్ధమైన పార్సెల్ లారీ

- *చీకటిగూడెం వద్ద ఒక్కసారిగా చెలరేగిన మంటలు*
- *పూర్తిగా కాలిపోయిన పార్సెల్ సరుకు వాహనం*
- *నీళ్లు సరిపోక మరో ఫైర్ ఇంజన్‌కు పోలీసుల ఏర్పాటు*

నల్గొండ, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): నల్గొండ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కేతపల్లి మండలం చీకటిగూడెం సమీపంలోని జాతీయ రహదారిపై పార్సెల్ సరుకుతో వెళ్తున్న లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే మంటలు వాహనం అంతటా వ్యాపించడంతో లారీ పూర్తిగా దగ్ధమైంది.

మిగతా 2 లో..



ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలు
వేగవంతం చేయాలి



- *కరీంనగర్, జనగామ, సిద్ధిపేట మెడికల్ కాలేజీలపై సమీక్ష*
- *హాస్టళ్ల నిర్మాణాలు నిర్ణీత గడువులో పూర్తి చేయాలి*
- *వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులపైనా ఆరా*
- *నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి: మంత్రి దామోదర*

2 లో..

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

తెలంగాణలో అవినీతి పాలన సాగుతుంది

(మొదటి పేజీ తరువాయి)

నితిన్ నబీన్ విమర్శించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళనకు సంబంధించిన ప్రక్రియపై తాము ఇచ్చిన వివరణకు ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని చెప్పారు. రాహుల్‌గాంధీ తరచూ ఓటు చోరీ అంటూ ఆరోపణలు చేస్తున్నారని, వాస్తవ పరిస్థితులను ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. దేశంలో 13 కోట్ల ఓట్లు చోరీ అయ్యాయని రాహుల్ చెబుతున్నారని ప్రస్తావిస్తూ, మూడు కోట్ల మంది మరణించిన తర్వాత కూడా వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగాలా? అని ప్రశ్నించారు. ఆరు కోట్ల మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినప్పుడు వారికి రెండు ప్రాంతాల్లో ఓట్లు ఉండాలా? అని నిలదీశారు. చొరబాటుదారులకు ఓటు హక్కు కల్పించాలని రాజ్యాంగం చెప్పలేదని వ్యాఖ్యానించారు. రాజ్యాంగాన్ని రాహుల్‌గాంధీ జేబులో పెట్టుకుంటే, తాము హృదయంలో పెట్టుకుని గౌరవిస్తామని వ్యాఖ్యానించారు.





తెలంగాణలో గతంలో ఒక అవినీతి పాలనకు ప్రజలు ముగింపు పలికారని, ప్రస్తుతం అంతకుమించిన అవినీతి పాలన కొనసాగుతోందని నితిన్ నబీన్ ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై నిలదీశారు. ప్రధాని నరేంద్ర మోదీ త్వరలోనే పదవి నుంచి దిగిపోతారని కొందరు వ్యాఖ్యానిస్తున్నారని ప్రస్తావించిన ఆయన, వచ్చే ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మరోసారి ఎర్రకోటపై కాషాయ జెండా ఎగురుతుందని అన్నారు. మోదీ కంటే ముందు ఏ ప్రధానమంత్రి కూడా దేశ సైనికులతో కలిసి దీపావళి వేడుకలు జరుపుకోలేదని పేర్కొన్నారు. విదేశీ టూల్‌కిట్ ద్వారా దేశంలో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తెలంగాణకు చెందిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావును గౌరవించాలన్న ఆలోచన కాంగ్రెస్‌కు ఎప్పుడూ లేదని, ఆయనకు తగిన గౌరవం కల్పించే పని బీజేపీ ప్రభుత్వమే చేసిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో అవినీతి పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారా? అని సభకు హాజరైన వారిని ప్రశ్నించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీకి ఆదరణ లేదని చెబుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఒకసారి కరీంనగర్‌కు వచ్చి చూడాలని సవాల్ విసిరారు. కరీంనగర్‌లో ప్రజల నుంచి లభిస్తున్న స్పందనను చూస్తే రాష్ట్రంలో బీజేపీ బలం ఏమిటో అర్థమవుతుందని అన్నారు. కాంగ్రెస్ నేతలు తమ పార్టీకి 90 సీట్లు వస్తాయని చెబుతున్నారని ప్రస్తావిస్తూ, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందించనందుకా? వృద్ధుల పింఛన్లను రూ.4 వేలకు పెంచనందుకా? అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఎల్నినో ప్రభావంతో రైతాంగం కష్టాలు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రైతులకు అవసరమైన సహాయం అందించడం లేదని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్‌కు 90 సీట్లు ఎలా వస్తాయని నిలదీశారు.
తెలంగాణ ప్రజలు ఇప్పటికే రెండుసార్లు బీఆర్ఎస్‌కు, ఒకసారి కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారని బండి సంజయ్ పేర్కొన్నారు. ఈసారి మాత్రం బీజేపీకి అవకాశం ఇవ్వాలని ప్రజలు నిర్ణయించుకున్నారని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రాజకీయ మార్పు రావాలంటే బీజేపీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. మరోవైపు నితిన్ నబీన్ కూడా కేంద్రంలో మోదీ నాయకత్వంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కరీంనగర్‌లో నిర్వహించిన మహా పాదయాత్రలో జాతీయ అధ్యక్షుడు పాల్గొనడం, రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం, వచ్చే ఎన్నికల్లో బీజేపీ విజయంపై ధీమా వ్యక్తం చేయడం పార్టీ శ్రేణుల్లో రాజకీయ ఉత్సాహాన్ని నింపే ప్రయత్నంగా నిలిచింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల పాలనపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తమకు అనుకూలంగా మలుచుకోవాలని బీజేపీ నేతలు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

కార్యకర్తల త్యాగాలతోనే
కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది

(మొదటి పేజీ తరువాయి)

అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్ల పాలనను విజయవంతంగా కొనసాగిస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 2024 నుంచి 2034 వరకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగాలన్నలక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. రెండోసారి అధికారంలోకి రావడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై ఏఐసీసీ ఇన్‌ఛార్జి సందీప్‌తో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. ఒకే నియోజకవర్గం నుంచి ఒకే పార్టీ తరపున వరుసగా ఏడుసార్లు గెలిచిన అనుభవం తనకు ఉందని ఈ సందర్భంగా ప్రస్తావించారు.
తెలంగాణ ప్రజలు, రైతాంగానికి మేలు జరిగేలా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. సాగునీటి రంగంలో కృష్ణా, గోదావరి జలాలను గతంలో ఎన్నడూ లేని స్థాయిలో వినియోగిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అత్యధిక వ్యవసాయ విస్తీర్ణం నమోదైందని, వరి ఉత్పత్తి, ధాన్యం సేకరణలోనూ రికార్డు స్థాయికి చేరుకున్నామని వివరించారు. రైతులకు సాగునీటి సౌకర్యాలు కల్పించడంతో పాటు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సాగునీటి ప్రాజెక్టులను అసంపూర్తిగా వదిలేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, ఎస్ఎల్‌బీసీ, డిండి తదితర ప్రాజెక్టులు పూర్తికాలేదని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని, ఎన్నికల్లోపు పెండింగ్ పనులను పూర్తిచేసేలా ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని వెల్లడించారు. సాగునీటి ప్రాజెక్టుల పూర్తితో రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.
సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం వేగవంతంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. పేదలకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందించామని చెప్పారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామన్నారు. గాంధీభవన్‌తో తనకు ఎంతోకాలంగా భావోద్వేగ అనుబంధం ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తల శ్రమను గుర్తిస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

గ్లోబల్ సమిట్ ఏర్పాట్లలో నిర్లక్ష్యం సహించేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

సంప్రదాయాలు, చారిత్రక వైభవం ప్రతిబింబించాలని రేవంత్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమ్మక్క-సారలమ్మ ఆలయ ప్రాంగణంలోని తోరణాల నమూనాలను సమిట్ వేదిక అలంకరణలో ఉపయోగించాలని సూచించారు. తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పేలా ప్రాంగణ రూపకల్పన ఉండాలని, రాష్ట్ర కళలు, సంస్కృతి, సంప్రదాయాలను అంతర్జాతీయ ప్రతినిధులకు పరిచయం చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సమిట్‌కు వచ్చే విదేశీ అతిథులకు తెలంగాణ ఆతిథ్య సంప్రదాయాన్ని పరిచయం చేయడంతోపాటు రాష్ట్ర సాంస్కృతిక గుర్తింపును ప్రపంచ వేదికపై ప్రదర్శించే అవకాశంగా ఈ కార్యక్రమాన్ని మలచాలని పేర్కొన్నారు. ఏర్పాట్లలో స్థానిక సంస్కృతికి ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రతి అంశంలోనూ తెలంగాణ ప్రత్యేకత కనిపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమ్మిట్‌కు ముఖ్యమైన ప్రతినిధులను ఆహ్వానించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. కీలకమైన డెలిగేట్లకు ఆహ్వానాలు పంపే బాధ్యతను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబుకు అప్పగించాలని అధికారులకు తెలిపారు. దేశ, విదేశాల్లో పేరుపొందిన విశ్వవిద్యాలయాలు గ్లోబల్ సమిట్‌లోని విద్యా ప్రదర్శన విభాగంలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యారంగంలో వస్తున్న మార్పులు, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను అంతర్జాతీయ స్థాయి ప్రతినిధుల ముందుకు తీసుకువచ్చేలా విద్యా ప్రదర్శన విభాగాన్ని తీర్చిదిద్దాలని అన్నారు. ఆహ్వానాల పంపిణీ నుంచి ప్రతినిధుల రాక, వసతి, రవాణా, కార్యక్రమాల నిర్వహణ వరకు ప్రతి అంశాన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. గ్లోబల్ సమిట్‌లో భాగంగా నిర్వహించే ఎయిర్ షోతోపాటు ఇతర కార్యక్రమాలను వీక్షించే అవకాశం ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కల్పించాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించడం ద్వారా విద్యార్థులకు కొత్త విషయాలపై అవగాహన పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. సమిట్ ఏర్పాట్లలో విద్యార్థుల భాగస్వామ్యానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతినిధులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించడం, అంతర్జాతీయ సంస్థలు, విశ్వవిద్యాలయాల భాగస్వామ్యాన్ని పెంచడం వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. గ్లోబల్ సమిట్-2026ను రాష్ట్ర ప్రతిష్ఠను ప్రపంచానికి చాటిచెప్పే కార్యక్రమంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఏసీబీ డైరెక్టర్‌గా ఎస్. చంద్రశేఖర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నూతన డైరెక్టర్‌గా ఐపీఎస్ అధికారి ఎస్. చంద్రశేఖర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. నవంబర్ 23, 2026న హైదరాబాద్‌లోని ఏసీబీ కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు అధికారిక సమాచారం వెల్లడైంది. రాష్ట్రంలో అవినీతి నిరోధక చర్యలను పర్యవేక్షించే కీలక విభాగానికి ఆయన డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వ శాఖలు, వివిధ సంస్థల్లో అవినీతికి సంబంధించిన ఫిర్యాదులు, ఆరోపణలపై ఏసీబీ విచారణలు నిర్వహిస్తుంది. అవినీతి నిరోధక శాఖ పరిధిలో నమోదయ్యే కేసులు, దర్యాప్తులు, తనిఖీలు, ఇతర కార్యాచరణకు డైరెక్టర్ నాయకత్వం వహిస్తారు. ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో ఈ విభాగం కీలక పాత్ర పోషిస్తుంది. ఎస్. చంద్రశేఖర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించడంతో తెలంగాణ ఏసీబీకి కొత్త నాయకత్వం బాధ్యతలు చేపట్టినట్లయింది. శాఖలో కొనసాగుతున్న కార్యకలాపాలు, పరిపాలనా వ్యవహారాల నిర్వహణలో ఆయన కీలకంగా వ్యవహరించనున్నారు.
రాష్ట్రంలో అవినీతికి సంబంధించిన ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడం, ప్రభుత్వ కార్యాలయాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయడం ఏసీబీ ప్రధాన విధులు. ఈ నేపథ్యంలో నూతన డైరెక్టర్ బాధ్యతల స్వీకరణతో శాఖ తదుపరి కార్యాచరణపై ఆసక్తి నెలకొంది.

ప్రభుత్వ భూముల వేలాన్ని నిలిపివేయాలి

(మొదటి పేజీ తరువాయి)

మిగలవని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రజల కోసం పనిచేయాలా? లేక వ్యాపారుల ప్రయోజనాల కోసం పనిచేయాలా? అని ప్రశ్నించారు.
తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇదే భూమిని డీఎల్ఎఫ్ సంస్థకు అప్పగించే ప్రయత్నం చేసినప్పుడు వ్యతిరేకించానని ఈటల గుర్తుచేశారు. పళ్ల దుకాణాలు, బజ్జీ, ఇడ్లీ బండ్లు నడుపుకునే వారు, రోజువారీ కూలీలు, ఇళ్లల్లో పనిచేసే పేదలకు ఇళ్లు ఎక్కడ నిర్మిస్తారని ప్రశ్నిస్తూ ఆ నిర్ణయాన్ని అడ్డుకున్నట్లు తెలిపారు. అప్పట్లో డీఎల్ఎఫ్‌కు కేటాయించిన 19 ఎకరాలు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయని పేర్కొన్నారు. మెట్రో నిర్మాణం కోసం ప్రభుత్వం విలువైన భూములను అప్పగించిందని, వాటిలో వాణిజ్య సముదాయాలు నిర్మించి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారని ఆరోపించారు. వై జంక్షన్ వద్ద కూడా ఏడు ఎకరాల భూమిలో భారీ మాల్ నిర్మించారని తెలిపారు.
60 నుంచి 80 ఏళ్ల క్రితం పేదలకు అసైన్ చేసిన భూములను వారు ఎంతో శ్రమించి సాగులోకి తెచ్చుకున్నారని ఈటల అన్నారు. రాళ్లు తొలగించి, చెత్తను శుభ్రం చేసి, బోర్లు, బావులు తవ్వి కూరగాయలు పండించుకుంటూ జీవిస్తున్న రైతుల భూములను తిరిగి తీసుకునే ప్రయత్నం చేయడం అన్యాయమని విమర్శించారు. 70 ఏళ్ల క్రితం ఇచ్చిన అసైన్డ్ భూములపై లబ్ధిదారులకు అమ్ముకునే హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం పేదల భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెడుతోందని విమర్శించిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాన్ని అనుసరిస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో సొంత ఇళ్లు లేని పేదలు, అద్దె ఇళ్లలో నివసించే కుటుంబాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా ప్రస్తావించారు. నియోపోలిస్ వంటి ప్రాంతాల్లో ఎకరం రూ.250 కోట్ల నుంచి రూ.270 కోట్ల వరకు ధర పలుకుతోందని, ఇప్పటికే రూ.26 వేల కోట్లకు పైగా విలువైన భూములను విక్రయించారని ఈటల ఆరోపించారు. తన అంచనా ప్రకారం రూ.50 వేల కోట్ల విలువైన భూములను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నారని, దీనివెనుక అక్రమ ప్రయోజనాలు ఉన్నాయని విమర్శించారు. కూకట్‌పల్లి సమీపంలోని ఐడీఎల్ భూములను గతంలో పరిశ్రమ ఏర్పాటు కోసం రైతుల నుంచి సేకరించి ఉచితంగా ఇచ్చారని, ప్రస్తుతం పేలుడు పదార్థాల ఉత్పత్తి నిలిచిపోయిన నేపథ్యంలో ఆ భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సూచించారు. ఫీనిక్స్ సంస్థకు గతంలో 100 ఎకరాలు కేటాయించడంపై కూడా ఆరోపణలు చేశారు. ఐడీఎల్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే సుమారు రూ.30 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని, ఆ నిధులతో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, రైతు బీమా, రైతు బంధు, ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, పేదల ఇళ్ల నిర్మాణానికి ఖర్చు చేయవచ్చని తెలిపారు. రూ.40 వేల కోట్ల రైతు రుణమాఫీని ఒకేసారి చేస్తానన్న ప్రభుత్వం ఈ భూముల విషయంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ ధర్నాలో బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు మాధవరం కాంతారావు, వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, మాజీ కార్పొరేటర్లు మహేందర్, శేషగిరి, శ్రీకర్ రావు, ఇతర నాయకులు, కార్యకర్తలు, భూముల పరిరక్షణ కోరుతున్న రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- **కరీంనగర్, జనగామ, సిద్ధిపేట మెడికల్ కాలేజీలపై సమీక్ష**
- **హాస్టళ్ల నిర్మాణాలు నిర్ణీత గడువులో పూర్తి చేయాలి**
- **వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులపైనా ఆరా**
- **నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి: మంత్రి దామోదర**

హైదరాబాద్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణలో వైద్య మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. కరీంనగర్, జనగామ, సిద్ధిపేట ప్రభుత్వ వైద్య కళాశాలలు, వాటికి అనుబంధంగా నిర్మిస్తున్న హాస్టళ్ల పనులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పురోగతిపై సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆయా నిర్మాణ పనుల ప్రస్తుత పరిస్థితి, ఇప్పటివరకు సాధించిన పురోగతి, ఎదురవుతున్న సమస్యలపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కళాశాల భవనాలతో పాటు విద్యార్థుల వసతి కోసం చేపడుతున్న హాస్టళ్ల నిర్మాణాలను కూడా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల ఆలస్యానికి కారణాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.
వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులపైనా మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే ఉమ్మడి వరంగల్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని అంశాలను ముందుగానే పరిశీలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వైద్య విద్యను బలోపేతం చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కొత్త వైద్య కళాశాలలు, హాస్టళ్లు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలు పూర్తయితే వైద్య విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ప్రజలకు ఉన్నత స్థాయి వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు.
ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు, సంబంధిత జిల్లాల కలెక్టర్లు, వైద్య విద్య సంచాలకురాలు డాక్టర్ వాణి పాల్గొన్నారు. ఆరోగ్యశాఖ, రోడ్లు భవనాల శాఖకు చెందిన ఉన్నతాధికారులు కూడా సమావేశానికి హాజరై నిర్మాణ పనుల వివరాలను మంత్రులకు వివరించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తి చేసేందుకు శాఖల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని మంత్రి అధికారులకు సూచించారు.

జాతీయ రహదారిపై దగ్ధమైన పార్సెల్ లారీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఘటనతో స్థానికంగా కలకలం రేగింది. ప్రమాద సమయంలో లారీలో ఉన్న సరుకు కూడా మంటలకు ఆహుతైనట్లు సమాచారం.
జాతీయ రహదారిపై వెళ్తున్న లారీలో అకస్మాత్తుగా మంటలు రావడంతో వాహనదారులు అప్రమత్తమయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో లారీని పూర్తిగా కాలిపోకుండా అడ్డుకోవడం సాధ్యపడలేదు. ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిప్రమాదం కారణంగా రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. లారీ పూర్తిగా మంటల్లో చిక్కుకోవడంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతో పాటు అగ్నిమాపక చర్యలకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.
మంటలను అదుపులోకి తీసుకురావడానికి అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే మంటలు ఆర్పే క్రమంలో ఫైర్ ఇంజన్‌లోని నీళ్లు పూర్తయ్యాయి. దీంతో సహాయక చర్యలకు కొంత ఆటంకం ఏర్పడింది. పరిస్థితిని గుర్తించిన పోలీసులు సూర్యాపేట నుంచి మరో ఫైర్ ఇంజన్‌ను ఘటనా స్థలానికి రప్పించారు. అదనపు అగ్నిమాపక వాహనం సహాయంతో మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై కొంతసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. లారీ దగ్ధం కావడంతో భారీగా ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదానికి గల కారణాలు, లారీలో ఉన్న సరుకు వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదంలో ఎవరైనా గాయపడ్డారా అనే వివరాలు కూడా వెల్లడికావాల్సి ఉంది. పోలీసులు ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
మంగళవారం - 24 - నవంబర్ 2026

కరాటే పోటీల్లో సత్తా చాటిన నారాయణ విద్యార్థి



- **ఆల్ ఇండియా ఛాంపియన్‌షిప్–2026లో మట్టా స్వామి గౌడ్ ప్రతిభ.**
- **అభినందించిన పాఠశాల యాజమాన్యం.**

సత్తుపల్లి, నవంబరు 23 (తెలంగాణ ముచ్చట్లు): ఆల్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్-2026లో నారాయణ స్కూల్ సత్తుపల్లికి చెందిన విద్యార్థి మట్టా స్వామి గౌడ్ ప్రతిభ చాటాడు. కరాటే పోటీల్లో రాణించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చిన విద్యార్థిని పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఏజీఎం రాంకీ, ఆర్ఐ క్రాంతి స్వామి గౌడ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడల పట్ల ఆసక్తి, సాధనలో పట్టుదల, కృషిని ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ రామ్మూర్తి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించడం అభినందనీయమన్నారు. విద్యార్థి విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, సహకారం కీలకమని పేర్కొంటూ స్వామి గౌడ్ ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, చదువుతో పాటు క్రీడల్లోనూ ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించడమే పాఠశాల లక్ష్యమని తెలిపింది. స్వామి గౌడ్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఉపాధ్యాయ బృందం ఆకాంక్షించింది.

భక్తిపారవశ్యంలో వల్లభాపురం శివాలయం.. కార్తీక పౌర్ణమికి అర్చకుల ప్రత్యేక ఏర్పాట్లు!

- **సామూహిక రుద్రాభిషేకం, సాయంత్రం దీపోత్సవం, ఆకాశదీప కార్యక్రమాలు**



ఎల్కతుర్తి నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వల్లభాపురం గ్రామంలోని శ్రీ పశుపతినాథ్ దేవస్థాన శివాలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలకు సర్వం సిద్ధమైంది. పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ, అర్చకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.
ఈ సందర్భంగా వీరశైవ జంగమ ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆలయ అర్చకులు శివశ్రీ సదా నిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి స్వామివారికి సామూహిక పంచామృత సహిత రుద్రాభిషేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తుల భాగస్వామ్యంతో సహస్ర బిల్వార్చన నిర్వహిస్తామని, పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ ఉంటుందని వెల్లడించారు.
అలాగే సాయంత్రం 6 గంటల నుంచి కార్తీక దీపోత్సవ వేడుకలు ప్రారంభమవుతాయని, ఈ సందర్భంగా లింగార్చన, ఆకాశదీప కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు వివరించారు.
కార్తీక పౌర్ణమి పర్వదినానికి శివారాధనలో విశేష ప్రాధాన్యత ఉందని, ఈ పవిత్ర రోజున పశుపతినాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొనడం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు.
కార్తీక పౌర్ణమి సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజలు, దీపోత్సవ వేడుకలకు భక్తులందరూ కుటుంబ సమేతంగా అధిక సంఖ్యలో హాజరై స్వామివారి సంపూర్ణ అనుగ్రహానికి పాత్రులు కావాలని ఆలయ కమిటీ, అర్చకులు శివశ్రీ సదా నిరంజన్ సిద్ధాంతి కోరారు.



కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు బీజం

- **మంకమ్మతోటలో ఇంటింటి ప్రచారం నిర్వహించిన గంగుల కమలాకర్, ఎమ్మెల్యే సంజయ్**

కరీంనగర్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ చరిత్రలోనే ఒక కీలక ఘట్టమని, ఆ దీక్ష ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు బీజం పడిందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. నవంబర్ 29న నిర్వహించనున్న దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ నగరంలోని మంకమ్మతోటలో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి గంగుల కమలాకర్‌తో పాటు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ హాజరై, పార్టీ శ్రేణులతో కలిసి ప్రజలకు బొట్టుపెట్టి దీక్షా దివస్ సభకు ఆహ్వానించారు.

గ్రానైట్ మాఫియాపై బీజేపీ మౌనం ఎందుకు?

- **అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలి.**
- **ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విధానాన్ని రద్దు చేయాలి: బండారి శేఖర్.**



కరీంనగర్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): అవినీతిపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. కరీంనగర్ జిల్లాలో వెలుగుచూసిన గ్రానైట్ అక్రమాలు, పన్నుల ఎగవేత, విదేశీ మారక ద్రవ్య నిబంధనల ఉల్లంఘనలు, కేంద్ర ప్రభుత్వ పశుసంపద అభివృద్ధి పథకంలో అవినీతి ఆరోపణలపై ఎందుకు మౌనం వహిస్తోందని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ప్రశ్నించారు. ఈ వ్యవహారాలపై సమగ్ర విచారణ జరిపించాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విధానాన్ని రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.
ఈ సందర్భంగా బండారి శేఖర్ మాట్లాడుతూ.. కరీంనగర్ గ్రానైట్ వ్యాపారంలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాల వెనుక ఉన్న రాజకీయ నాయకుల పాత్రను కూడా సమగ్రంగా విచారించాలని కోరారు. పన్నుల ఎగవేత, విదేశీ మారక ద్రవ్య నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేసినప్పటికీ చర్యల పురోగతిపై స్పష్టత లేదని విమర్శించారు. గతంలో గ్రానైట్ వ్యవహారానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాల్లో రూ.1.08 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెలువడిన సమాచారం నేపథ్యంలో దర్యాప్తు పురోగతిని వెల్లడించాలని డిమాండ్ చేశారు.
కేంద్ర ప్రభుత్వ పశుసంపద అభివృద్ధి పథకంలో కరీంనగర్ జిల్లాలో నిధుల వినియోగం, పశువుల కొట్టాల నిర్మాణం, పశువుల కొనుగోలు, లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయి స్వతంత్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు అని, ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో అర్హులైన ఒక్క ఓటరు కూడా తన హక్కును కోల్పోకూడదని అన్నారు. ప్రజల్లో అనుమానాలు, ఆందోళనలు కలిగిస్తున్న ప్రత్యేక సమగ్ర సవరణ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.
కరీంనగర్‌కు వచ్చిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు ఈ అంశాలపై సమాధానం చెప్పాలని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సంబంధిత దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని బండారి శేఖర్ కోరారు. అవినీతిపై పోరాటం మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలని స్పష్టం చేశారు.
ఈ ధర్నాలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, నాయకులు ప్రవీణ్, లక్ష్మయ్య, బన్నీ, రవీందర్, అఖిల్, రమేష్ సాగర్, అనిల్, సాయి, మహిళా నాయకులు రాజమణి, లక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

మానేరు కట్ట అభివృద్ధికి కెఎన్ఆర్ కృషి

- **పిచ్చి మొక్కల తొలగింపు, వీధి దీపాల వెలుగులకు చర్యలు.. యోగా షెడ్డు నిర్మాణానికి కృషి**



కరీంనగర్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్ మానేరు కట్టపై సుడా మాజీ చైర్మన్ కొమటిరెడ్డి నరేందర్ రెడ్డి కెఎన్ఆర్ మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.
మానేరు కట్టపై పిచ్చి మొక్కలను తొలగించేందుకు కృషి చేశానని, కట్టపై అన్ని వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకున్నానని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం మానేరు కట్టపై యోగా షెడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ కుటుంబ భీమా పథకంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని, తమ తమ కాలనీలలో ప్రజలకు ఈ పథకం గురించి తెలియజేయాలని సూచించారు. తాను ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎవరికైనా ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం కోసం కృషి చేస్తానని కొమటిరెడ్డి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఆరోపణలకు భయపడేది లేదు.. ప్రజాస్వామ్య పరిరక్షణే బీజేపీ లక్ష్యం!

- **కరీంనగర్ మహా పాదయాత్రలో ఎల్కతుర్తి మండల బీజేపీ శ్రేణుల భారీ భాగస్వామ్యం**
- **400 మందికి పైగా నాయకులు, కార్యకర్తల తరలింపు**



ఎల్కతుర్తి నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు, ప్రచారాల నేపథ్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా కరీంనగర్‌లో నిర్వహించిన మహా పాదయాత్రలో ఎల్కతుర్తి మండల భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో సుమారు 400 మందికి పైగా పార్టీ శ్రేణులు తరలివెళ్లి తమ భాగస్వామ్యాన్ని చాటుకున్నారు.
కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహా పాదయాత్రకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ఎన్నికల వ్యవస్థపై వస్తున్న ఆరోపణలు, అపోహలపై ప్రజలకు వివరణ ఇవ్వడం ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశమని పార్టీ నాయకులు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వానికి యువతతో పాటు ప్రజల మద్దతు ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలకు బీజేపీ కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదని, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడమే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో సరైన అవగాహన కల్పించేందుకు పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేస్తాయని తెలిపారు. ఎల్కతుర్తి మండలం నుంచి సుమారు 400 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు మహా పాదయాత్రలో పాల్గొనడం పార్టీ శ్రేణుల ఐక్యతకు, క్రమశిక్షణకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన గ్రామ అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మండలంలోని వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వైద్య పరికరాలున్నా.. పేదలకు అందని వైద్యం

- **కొమ్ము చెన్నకేశవులు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు**



వనపర్తి,నవంబర్23(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నప్పటికీ, నిపుణులైన వైద్యులు, వైద్య సిబ్బంది కొరత కారణంగా పేద ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందడం లేదని ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజాధనంతో కొనుగోలు చేసిన విలువైన వైద్య పరికరాలు నిరుపయోగంగా ఉండటం బాధాకరమని, వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురాకపోవడం వల్ల పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు పేద ప్రజలకు ప్రాణాధారంగా ఉండాల్సి ఉండగా, వైద్యులు, నిపుణులైన సిబ్బంది కొరతతో రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని, దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.జిల్లా కలెక్టర్ ఈ సమస్యపై తక్షణమే స్పందించి ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, అవసరమైన నిపుణులైన వైద్యులను, వైద్య సిబ్బందిని నియమించి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఎమ్మార్పీఎస్ తరఫున జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ, మహానీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ గంధం నాగరాజు మాదిగ, ఎంఎస్ఎఫ్ వనపర్తి కోఇన్‌చార్జి పుట్టపాక అజయ్ మాదిగ పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

పట్టుదలతో న్యాయవాదిగా ఎదిగిన మౌనిక



పెద్దమందడి,నవంబర్23(-తెలంగాణ ముచ్చట్లు): పట్టుదల, కృషి ఉంటే గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నిరూపించారు వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం బలిజపల్లి గ్రామానికి చెందిన వడ్ల మౌనిక చారి. న్యాయవాదిగా తన లక్ష్యాన్ని సాధించి గ్రామానికి గుర్తింపు తీసుకొచ్చారు. మౌనిక చారి హైదరాబాద్ హైకోర్టులో అడ్వకేట్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో తన పేరు నమోదు చేసుకొని వనపర్తి కోర్టులో న్యాయవాదిగా బాధ్యతలు చేపట్టారు. న్యాయ విద్యలో ప్రతిభ కనబరిచిన ఆమె వనపర్తిలోని ఎస్‌డీఎం లా కాలేజీలో టాపర్‌గా నిలవడం విశేషం. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చి కష్టపడి చదువుకుని న్యాయవాదిగా ఎదగడం పట్ల కుటుంబ సభ్యులు, బలిజపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆమె సాధించిన విజయాన్ని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు .ఈ సందర్భంగా మౌనిక చారి మాట్లాడుతూ తన భర్త శ్రీశైలం చారి (పోలీస్ కానిస్టేబుల్) అందించిన ప్రోత్సాహం, సహకారం వల్లే ఈ స్థాయికి చేరుకోగలిగానని సంతోషం వ్యక్తం చేశారు. తన విజయానికి భర్త ప్రోత్సాహం ఎంతో దోహదపడిందని తెలిపారు.గ్రామీణ ప్రాంతానికి చెందిన మహిళ న్యాయవాదిగా ఎదిగి వనపర్తి కోర్టులో బాధ్యతలు చేపట్టడం స్థానికంగా పలువురికి స్ఫూర్తినిస్తోంది.



ప్రతి కుటుంబానికి అండగా ఇందిరమ్మ బీమా పథకం

- **కొమ్ము వెంకటస్వామి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు**

పెద్దమందడి,నవంబర్23(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో ఇందిరమ్మ బీమా పథకాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి ఆధ్వర్యంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా కొమ్ము వెంకటస్వామి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ఇందిరమ్మ బీమా పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. కుటుంబంలో అనుకోని ఆపద ఎదురైనప్పుడు బాధిత కుటుంబాలకు ఈ పథకం ఎంతో అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ఇందిరమ్మ బీమా పథకంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, అర్హులైన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్, వడ్డే శేఖర్, ఆర్. పెద్ద శ్రీనివాస్ రెడ్డి, చందు రెడ్డి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి, ఆశా వర్కర్లు, మహిళలు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సేవా స్ఫూర్తిని చాటిన అయ్యపురెడ్డి మెమోరియల్ ఫౌండేషన్

పెద్దమందడి,నవంబర్23(తెలంగాణ ముచ్చట్లు): ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ, మానవత్వమే ధ్యేయంగా అయ్యపురెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ తన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన సూర రవి సాగర్‌కు వైద్య చికిత్స నిమిత్తం ఫౌండేషన్ తరఫున రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.సూర రవి సాగర్ గత కొన్ని సంవత్సరాలుగా కిడ్నీ సంబంధిత అనారోగ్య సమస్యతో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన పదవ తరగతి నాటి మిత్రుల ద్వారా అయ్యపురెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లగా, ఫౌండేషన్ స్పందించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించింది. అయ్యపురెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఇటువంటి సేవా కార్యక్రమాలకే పరిమితం కాకుండా, సమాజంలో అవసరంలో ఉన్నవారిని ఆదుకుంటూ పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. పేదలకు ఆర్థిక చేయూత, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్య సహాయం అందిస్తూ సేవాభావాన్ని చాటుకుంటోంది.కష్టకాలంలో ఆపన్నులకు అండగా నిలవడం, తోటి మనిషికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఈ కార్యక్రమం మరోసారి చాటిచెప్పింది. ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి.

ఎమ్మెల్యే చొరవతో మూడు గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం

- **మోజర్ల, మద్దిగట్ల, అమ్మపల్లి గ్రామాల ప్రజల చిరకాల కోరిక నెరవేర్పు**



వనపర్తి,నవంబర్23(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల, మద్దిగట్ల, అమ్మపల్లి గ్రామాల ప్రజలకు శుభవార్త. గతంలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సౌకర్యం వనపర్తి శాసనసభ్యులు తుడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవ, సహకారంతో తిరిగి పునఃప్రారంభమైంది. దీంతో మూడు గ్రామాల ప్రజల చిరకాల కోరిక నెరవేరడంతో పాటు గ్రామస్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.బస్సు సౌకర్యం పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు,మహిళలు,వృద్ధులు సహా గ్రామ ప్రజలకు ప్రయాణ కష్టాలు తొలగనున్నాయి. ముఖ్యంగా విద్య, వైద్యం, ఉద్యోగ, వ్యాపార అవసరాల కోసం పట్టణాలకు వెళ్లే వారికి ఈ బస్సు సౌకర్యం ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది. గతంలో బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు తిరిగి ఆర్టీసీ బస్సు అందుబాటులోకి రావడం ఎంతో ఊరటనిచ్చింది.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల రవాణా అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ బస్సు సౌకర్యం పునరుద్ధరణకు ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డికి మోజర్ల, మద్దిగట్ల, అమ్మపల్లి గ్రామాల ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందించి రవాణా సౌకర్యాన్ని తిరిగి అందుబాటులోకి తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మోజర్ల, మద్దిగట్ల, అమ్మపల్లి గ్రామాల సర్పంచులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ పునర్నిర్మాణం సాధ్యం.. రాష్ట్రానికి ఆయన పాలనే శ్రీరామరక్ష

- **దీక్షా దివస్ సభకు వేలాదిగా తరలిరావాలి.. విజయవంతం చేయాలి: జీవన్ రెడ్డి**



చొప్పదండి, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణం కేసీఆర్‌తోనే సాధ్యమని, రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులు కాలం తెచ్చినవి కావని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువని విమర్శించారు. నవంబర్ 29న కరీంనగర్‌లో నిర్వహించనున్న దీక్షా దివస్ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర, బోయినపల్లి మండలాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన దీక్షా దివస్ సన్నాహక సమావేశానికి తాటిపర్తి జీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నవంబర్ 29న కరీంనగర్‌లో జరగనున్న దీక్షా దివస్ సభ ఏర్పాట్లు, విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులతో చర్చించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కొత్త జైపాల్ రెడ్డి తదితర నాయకులు తాటిపర్తి జీవన్ రెడ్డికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో గంగాధర, బోయినపల్లి మండలాల స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తకొండ వీరభద్ర స్వామి ఆలయ షాపింగ్ కాంప్లెక్స్ వేలం పూర్తి

- **రూ.8,100తో షాపు నంబర్ 14ను దక్కించుకున్న కే. వెంకటస్వామి**
- **మూడు సంవత్సరాల పాటు కొనసాగనున్న షాపుల లీజు**



కొత్తకొండ, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానానికి సంబంధించిన షాపింగ్ కాంప్లెక్స్ షాపుల లీజు హక్కుల కోసం సోమవారం నిర్వహించిన టెండర్ కమ్ బహిరంగ వేలం ప్రక్రియలో పలువురు వ్యాపారులు పాల్గొన్నారు. పోటాపోటీగా సాగిన వేలం పాటలో మొత్తం 14 షాపులకు లీజుదారులను ఎంపిక చేశారు. వేలంలో షాపు నంబర్ 1ను చింత రాజు రూ.3,400కు, షాపు నంబర్ 2ను ఎం. అనిల్ కుమార్ రూ.3,600కు, షాపు నంబర్ 3ను జి. లక్ష్మణ్ రూ.3,400కు, షాపు నంబర్ 4ను వై. శ్రీనివాస్ రూ.3,400కు దక్కించుకున్నారు.అదేవిధంగా షాపు నంబర్ 5ను చింత రాజు రూ.6,600కు, షాపు నంబర్ 6ను వై. రవీందర్ రూ.3,600కు, షాపు నంబర్ 7ను టీ. తిరుపతి రూ.5,700కు, షాపు నంబర్ 8ను జి.సతీష్ రూ.5,700కు, షాపు నంబర్ 9ను జి.సతీష్ రూ.5,600కు, షాపు నంబర్ 10ను కే. సుమలత రూ.5,000కు, షాపు నంబర్ 11ను చి. రాజు రూ.5,700కు దక్కించుకున్నారు.షాపు నంబర్ 13ను జె. కిషన్ రూ.7,000కు, షాపు నంబర్ 14ను కే. వెంకటస్వామి రూ.8,100కు,షాపు నంబర్ 15ను కే.వెంకటస్వామి రూ.4,700కు వేలం పాటలో పొందారు. వీరిలో షాపు నంబర్ 14కు అత్యధిక ధర పలికింది.

ఈ మూడింటి వేలం వాయిదా

షాపు నంబర్ 12కు ఎవరూ వేలంలో పాల్గొనకపోవడంతో పాటు, పచ్చి కొబ్బరి, ముక్కలు, చీరలు, బియ్యం, కణుములు సేకరణ హక్కులు, పుట్నాలు, ప్యాలాల సేకరణ హక్కులకు కూడా పాటాదారులు హాజరుకాకపోవడంతో ఆయా వేలం ప్రక్రియలను నవంబర్ 30, 2026వ తేదీకి వాయిదా వేశారు.షాపుల లీజు హక్కులు 2027 జనవరి 1 నుంచి 2029 డిసెంబర్ 31 వరకు అమల్లో ఉండనున్నాయి.

పోతిరెడ్డిపల్లిలో కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

- **ఉపసర్పంచ్ రాపర్తి సంధ్య–కొంరయ్యతో పాటు వార్డు సభ్యులు, గౌడ సంఘం ప్రతినిధుల చేరిక**
- **కండువాలు కప్పి ఆహ్వానించిన హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్**

వీణవంక, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీణవంక మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుపాల్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాపర్తి సంధ్య-కొంరయ్య, వార్డు సభ్యురాలు పుష్పలీల,గౌడ సంఘం సొసైటీ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి రాజుతో పాటు నాగిళ్ల సూర్యం, సయ్యద్, ఖలీం, రాపర్తి నితీష్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ, నూతన పెన్షన్లు, ఉచిత విద్యుత్ తదితర పథకాల పట్ల ఆకర్షితులై, వొడితల ప్రణవ్ నాయకత్వాన్ని బలపరుస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు తెలిపారు.అనంతరం వొడితల ప్రణవ్ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడేలా కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల అమలుతో పాటు అర్హులైన వారికి నూతన పెన్షన్లు, ఇందిరా కుటుంబ జీవిత బీమా వంటి పథకాలను అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో వీణవంక మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
మంగళవారం - 24 - నవంబర్ 2026
వరంగల్ 05



కన్నీటి కుటుంబానికి గ్రామపంచాయతీ చేయూత

- **రూ.20 వేల ఆర్థిక సాయం**

ఇల్లందకుంట, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని చాటిచెబుతూ కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామపంచాయతీ పాలకవర్గం మానవీయతను చాటుకుంది. గ్రామపంచాయతీలో సిబ్బందిగా విధులు నిర్వహిస్తున్న నక్క కృష్ణ అనారోగ్య కారణాలతో మృతి చెందడం పట్ల గ్రామంలో విషాదం నెలకొంది. ఆయన మృతితో ఆధారాన్ని కోల్పోయిన కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో గ్రామపంచాయతీ పాలకవర్గం ఆర్థిక సహాయం అందించింది.

సిరిసేడు సర్పంచ్ రేనుకుంట్ల శ్యామల కుమార్, ఉపసర్పంచ్ వంశీ, వార్డు సభ్యులు, పాలకవర్గ సభ్యులు కలిసి గ్రామపంచాయతీ తరఫున రూ.20,000 (ఇరవై వేల రూపాయలు) ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ సభ్యుడిని కోల్పోయిన బాధను ఎవరూ తీర్చలేరని, అయితే ఇలాంటి క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి మనోధైర్యాన్ని అందించడంతో పాటు, తమ వంతు సహాయంగా ఆర్థిక చేయూత అందించామని తెలిపారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

మాటల్లోనే కాకుండా ఆచరణలోనూ మానవత్వాన్ని చాటుకున్న సిరిసేడు గ్రామపంచాయతీ పాలకవర్గం తీరుపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి బీమా భరోసా

- **ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాపై అవగాహన కల్పించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్**

జమ్మికుంట, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ సూచించారు. జమ్మికుంట పట్టణంలోని 12వ వార్డులో నిర్వహించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. aఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ పరిధిలో రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం ఈ పథకంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదు ప్రక్రియకు రేషన్ కార్డు, ఫోన్ నంబర్ అవసరమని పేర్కొన్నారు. ప్రజలు తమ తమ వార్డుల్లోని వార్డు అధికారులను సంప్రదించి బీమా పథకానికి సంబంధించిన వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన కుటుంబాలన్నీ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ చుంచు రమాదేవి, చుంచు శివ, విజయ తదితరులు పాల్గొన్నారు.

రాకేష్ అన్నను విజయతీరాలకు చేర్చు మణికంఠా!

- **ఏనుగుల రాకేష్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ శబరిమలైకి అయ్యప్ప స్వాముల పాదయాత్ర**

మధిర, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): తమ అభిమాన నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఈసారి పట్ట భద్రుల శాసనమండలి సభ్యుడిగా ఘనవిజయం సాధించాలని ఆకాంక్షిస్తూ అయ్యప్ప స్వాములు పవిత్ర శబరిమలై క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. మధిర నియోజకవర్గం చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన తూములూరి అరవింద్ స్వామి, పుచ్చకాయల విష్ణు స్వామి మండల కాలం పాటు అయ్యప్ప దీక్షను భక్తిశ్రద్ధలతో ఆచరించి, నెత్తిన ఇరుముడి ధరించి శబరిగిరులకు పయనమయ్యారు. ఈ సందర్భంగా తమ అభిమాన నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి విజయాన్ని మణికంఠుడి సన్నిధిలో కోరుకుంటూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, రాకేష్ రెడ్డి, కమల్ రాజ్ చిత్రాలతో కూడిన ఫ్లెక్సీని చేతబట్టి పాదయాత్ర కొనసాగిస్తున్నారు. స్వామివారి నామస్మరణతో పవిత్ర యాత్రను సాగిస్తూ తమ నాయకుడిపై ఉన్న అభిమానాన్ని చాటుకుంటున్నారు.ఒకవైపు అయ్యప్ప స్వామిపై అపారమైన భక్తి, మరోవైపు తమ అభిమాన నాయకుడిపై అచంచలమైన నమ్మకంతో సాగుతున్న ఈ పాదయాత్ర పలువురి ప్రశంసలు అందుకుంటోంది. రాకేష్ రెడ్డి ఎమ్మెల్సీగా అత్యధిక మెజారిటీతో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ స్వామివారి ఆశీస్సులు కోరుతున్నారు.

హకీంపేటలో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 పై కలెక్టర్ సమీక్ష



మేడ్చల్ నవంబర్23(తెలంగాణ ముచ్చట్లు):మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ సోమవారం 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 కోసం జరుగుతున్న సన్నాహాలను సమీక్షించేందుకు మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ మిక్కిలినేని మను చౌదరి, ఐఏఎస్ హకీంపేటలోని తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాల (టీజీఎస్ఎస్)ను సందర్శించారు. ఈ పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖేలో ఇండియా హై పెర్ఫార్మెన్స్ డైరెక్టర్ (హెచ్పిడి) డాక్టర్ పి. రఘుపతి రావు, టీజీఎస్ఎస్ ప్రిన్సిపాల్ ఎం.కల్పన, క్రీడా అధికారి జి.వినోద్ కుమార్‌లతో సమావేశమై సన్నాహాల పురోగతిని మదింపు చేశారు. క్రీడల విజయవంతమైన నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై వారితో చర్చించారు. కొనసాగుతున్న సన్నాహక పనులను వేగవంతం చేయాలని, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు, వసతులు మరియు రవాణా/లాజిస్టిక్స్ ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026ను సాఫీగా, సమర్థవంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచిస్తూ, సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఎంతో అవసరమన్నారు.

ఈ ప్రతిష్టాత్మక జాతీయ క్రీడా పోటీని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తయ్యేలా చూడాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ప్రజావాణి అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

- **మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**



మేడ్చల్ మల్కాజిగిరి,నవంబర్23 (తెలంగాణ ముచ్చట్లు): ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డిలతో కలిసి కలెక్టర్ అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, హౌజింగ్, పంచాయతీ రాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించి మొత్తం 123 దరఖాస్తులు ప్రజల నుండి స్వీకరించినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాలతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా

- **ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



మేడ్చల్,నవంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు): జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో సోమవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టిఎస్ జెయు) నాయకులు చర్చలు జరిపారు. జర్నలిస్టులకు పెన్షన్ తోపాటు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో ప్రస్తావించాలని ఆయనను కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఎస్యూజే (ఐ) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్, టీఎస్జేయూ రాష్ట్ర కార్యదర్శి వాసు కుమార్, జిల్లా అధ్యక్షుడు ముత్యం ముఖేష్ గౌడ్, రాష్ట్ర నాయకులు చాప రవీందర్, జిల్లా నాయకులు పలుగుల పవన్ కుమార్, బుడంపల్లి నిరంత్ గౌడ్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ప్రత్యేక పెన్షన్, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలి

- **మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి వినతి**



మేడ్చల్,నవంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలోని జర్నలిస్టులకు శాశ్వత సామాజిక భద్రత కల్పించడంతో పాటు, పదవీ విరమణ అనంతరం ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రత్యేక జర్నలిస్టు పింఛన్, సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్జేయూ) కోరింది. ఈ మేరకు నేషనల్ జర్నలిస్ట్ యూనియన్ ఎన్ యుజె (ఐ) జాతీయ కార్యదర్శి మెరుగు చంద్రమోహన్ ఆధ్వర్యంలో సోమవారం మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చంద్రమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ శాశ్వత పింఛన్ పథకం అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ దృష్టికి ప్రజల ఇబ్బందులను తీసుకెళ్లడంలో వారు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పత్రికలు, స్థానిక మీడియా సంస్థల్లో పని చేస్తున్న అనేక మంది జర్నలిస్టులు పదవీ విరమణ అనంతరం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. టీఎస్జేయూ రాష్ట్ర కార్యదర్శి వాసు కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులకు వృద్ధాప్యంలో వైద్య ఖర్చులు, కుటుంబ పోషణ, జీవన భద్రత కోసం శాశ్వత భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. టీఎస్జేయూ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ముత్యం ముఖేష్ గౌడ్ మాట్లాడుతూ వార్తా పత్రికలు, టెలివిజన్ ఛానళ్లు, మీడియా సంస్థలకు ప్రభుత్వ, ప్రభుత్వ రంగ ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయంలో 10 శాతం మొత్తాన్ని జర్నలిస్టుల పింఛన్, సంక్షేమ నిధికి కేటాయించాలని కోరారు. దీనికి అదనంగా తెలంగాణ ప్రభుత్వం తన వంతుగా మరో 3 శాతం నిధులను సమకూర్చాలని కోరారు. ఈ విధంగా ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తే జర్నలిస్టులకు దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కల్పించవచ్చని పేర్కొన్నారు. టీఎస్జేయూ రాష్ట్ర నాయకులు, తెలుగు ప్రభ జిల్లా ప్రతినిధి చాప రవీందర్ మాట్లాడుతూ జర్నలిస్టుల పింఛన్, సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు వాటి నిర్వహణకు ప్రత్యేక బ్యాంకు ఖాతా ఏర్పాటు చేసి పారదర్శకంగా లెక్కలు నిర్వహించాలని కోరారు. అదే విధంగా ఏటా ఆడిట్ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులతోపాటు పదవీ విరమణ చేసిన జర్నలిస్టులకు సైతం వర్తించేలా సమగ్ర పింఛన్ పథకాన్ని రూపొందించాలని కోరారు. ఈ పథకం అర్హతలు, పింఛన్ మొత్తం, అమలు విధి విధానాలను రూపొందించేందుకు సీనియర్ సంపాదకులు, అనుభవజ్ఞులైన జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులతో ప్రత్యేక నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. చిన్న, మధ్య, పెద్ద వార్తాపత్రికలు, వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఎలాంటి సంఘ పరమైన వివక్ష లేకుండా సమాన అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలను పరిశీలించి ముఖ్యమంత్రి, సంబంధిత ప్రభుత్వ శాఖలకు సిఫారసు చేయాలని ఆయన కోరారు. జర్నలిస్టుల కోసం జర్నలిస్టులే.. జర్నలిస్టుల సంక్షేమం కోసం సమిష్టి పోరాటం అనే నినాదంతో జర్నలిస్టులందరికీ సామాజిక భద్రత కల్పించేందుకు ఈ ప్రయత్నం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ (టీఎస్జేయూ) నాయకులు బివిఎస్ చలపతి నాయుడు, పలుగుల పవన్ కుమార్, బుడంపల్లి నిరంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



వనపర్తి,నవంబర్23(తెలంగాణ ముచ్చట్లు): హైదరాబాద్‌లోని మియాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నమందడి గ్రామానికి చెందిన జనిగే భరత్ మృతి చెందడంపై వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బీటెక్ పూర్తి చేసిన భరత్ గత మూడు నెలలుగా సైట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. విధులకు వెళ్తున్న సమయంలో బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.భరత్ మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చిన్నమందడి గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి మనోధైర్యం కల్పించారు. తక్షణ సహాయంగా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ భర్త వెంకటస్వామి, ఉపసర్పంచ్ వాకిటి రవి, నాగేంద్రం యాదవ్ కాంగ్రెస్ కార్యకర్తలు జనిగే బాలకృష్ణ, సుఖ మన్నెం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

- **నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలి**
- **అధికారులకు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశం**



హనుమకొండ, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): పరకాల మున్సిపాలిటీ పరిధిలో పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని చిన్న సమావేశ మందిరంలో పరకాల మున్సిపాలిటీకి సంబంధించిన వివిధ అంశాలపై మున్సిపాలిటీ కమిషనర్ పోతరాజు పవన్, ఇతర అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పన్నుల వసూళ్ల పురోగతి,సిబ్బంది హాజరు,ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పెండింగ్ వివరాలు, ఘన వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాల శుద్ధి ప్రక్రియ తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పన్నుల వసూళ్ల లక్ష్యాలను చేరుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా లేదా అనే అంశంపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.
మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు తగిన చర్యలు చేపట్టాలని,ప్రజావాణిలో అందిన ఫిర్యాదులు, అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. పట్టణంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఘన వ్యర్థాల నిర్వహణ, వ్యర్థాల శుద్ధి ప్రక్రియలో నిర్దేశిత ప్రమాణాలను పాటిస్తూ పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మున్సిపాలిటీ మేనేజర్ రజిత, జూనియర్ అసిస్టెంట్ అధికారి అర్షద్, సాంకేతిక అధికారి రాము, పట్టణ ప్రణాళిక పర్యవేక్షకుడు రాజ్ కుమార్, రెవెన్యూ అధికారి గిరిబాబు, వ్యవస్థల నిర్వాహకుడు సతీష్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.





అక్రిడిటేషన్ కార్డులు వెంటనే ఇవ్వాలి

- **కార్డుల జారీలో డీపీఆర్ఓ నిర్లక్ష్యం వీడాలి**
- **రెండు, మూడు రోజుల్లో కార్డులు ఇవ్వకుంటే కార్యాలయం ముట్టడి, అవసరమైతే ఆమరణ దీక్ష**
- **జర్నలిస్టులకు కేటాయించిన 23.02 ఎకరాల స్థలాన్ని పరిశీలించిన ఫెడరేషన్ జిల్లా నేతలు**
- **తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్**

ఖమ్మం బ్యూరో , నవంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు): అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ ఖమ్మం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజే) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. జర్నలిస్టులకు కేటాయించిన 23.02 ఎకరాల స్థలాన్ని ఫెడరేషన్ నేతలు పరిశీలించారు. అలాగే అర్హులైన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం డిసెంబరు 5 నుంచి 9 వరకు నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ప్రకటించారు.
ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజే) జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ మాట్లాడుతూ... కేబుల్ టీవీ, కార్పొరేషన్ పరిధితో పాటు ఏ,బీ,సీ గ్రేడ్‌లలోని చిన్న, మధ్య, పెద్ద పత్రికల్లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు అనేక రకాల కారణాల పేరుతో, సాంకేతిక లోపాలు చూపుతూ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని విమర్శించారు. గతంతో పోలిస్తే ఎక్కువ ప్రెస్ అకాడమీ కార్డులు ఇచ్చామని చెబుతూనే, మరోవైపు కొర్రీ పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.ఇది నిరంతర ప్రక్రియ,నిర్విరామంగా కొనసాగే ప్రక్రియ అని చెబుతూనే జర్నలిస్టులకు అనేక రకాలుగా అన్యాయం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపుగా ఏడు నెలల సమయం గడిచిపోయినా నేటివరకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయకుండా తాత్సారం చేయడం వెనుక ఉన్న ఆంతర్యం ఏంటో అర్థం కావడం లేదని, మిగతా కార్డులను ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందని భావిస్తున్నామని చెప్పారు. సంక్షేమ పథకం అమలు కావాలన్నా, ఆరోగ్య రీత్యా హెల్త్ కార్డు రావాలన్నా, రవాణా సదుపాయం కల్పించాలన్నా అక్రిడిటేషన్ కార్డు ఒక క్రైటీరియాగా ఉందని, కవరేజీకి వెళ్లే క్రమంలో కార్డులు లేక జర్నలిస్టులు అనేక చోట్ల నుంచి రకరకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు.
ఇప్పటికైనా ఇక్కడున్న డీపీఆర్ఓ, అక్రిడిటేషన్ కమిటీ, దాంతోపాటు జిల్లా కలెక్టర్ రాబోయే రెండు,మూడు రోజుల్లో ప్రింటింగ్ దశలో ఉన్నాయని, సాంకేతిక లోపాలని రకరకాలుగా చెప్పి ఆపిన పెండింగ్ కార్డులను పూర్తిచేసి అర్హులైన జర్నలిస్టులందరికీ అందజేయాలని డిమాండ్ చేశారు. మరలా ఇదే కాలయాపన జరిగితే ఊరుకునేదే లేదని, రాష్ట్ర కమిటీతో మాట్లాడి రాష్ట్రవ్యాప్తంగా డీపీఆర్ఓ కార్యాలయాల వద్ద ముట్టడి కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఒకవేళ దానికి కూడా స్పందించకపోతే కార్డులు రాని జర్నలిస్టులందరినీ తీసుకొని అవసరమైతే కార్యాలయం ముందు ఆమరణ నిరాహార దీక్ష లాంటి కార్యక్రమాలు కూడా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి రామ్మూర్తి కి టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ నేతలు వినతిపత్రం అందజేసి పెండింగ్‌లో ఉన్న అక్రిడిటేషన్ కార్డులను, కేబుల్ ఛానల్ కు కూడా అక్రిడిటేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. అందుకు స్పందించిన డిఆర్ఓ.. కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు నాగేందర్ రెడ్డి, టీఎస్ చక్రవర్తి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నలుబోలు మధుశ్రీ, టీబీసీఏ జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, జిల్లా సహాయ కార్యదర్శి కొత్త యాకేష్, జిల్లా కమిటీ సభ్యులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కె. సుధాకర్ (సత్తుపల్లి), ఖమ్మం ప్రెస్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దగ్గుపాటి మాధవరావు, కొరకొప్పుల రాంబాబు, టీబీజెఏ కెమెరామెన్ అధ్యక్ష, కార్యదర్శులు ఫయాజ్, గణేష్, యాకూబ్ పాషా, శరత్, అర్షద్, అశోక్, హరి, పవన్, బండి కుమార్ ఖమ్మం టౌన్ రిపోర్టర్లు గోపి, కిరణ్, రవి, సైదులు సత్తుపల్లి రిపోర్టర్లు, ఆనంద్, బాజీ, క్రాంతి, ప్రసాద్, చారి, చంద్రశేఖర్, పాలేరు రిపోర్టర్లు లక్ష్మారెడ్డి, యస్.డి కర్ణ, అచ్యుతరామారావు, వెంకట్, స్వరూప్, రాధాకృష్ణ, గోపి, గంగాధర్, నాగలక్ష్మి, శ్రీదేవి, వైరా రిపోర్టర్లు గుడిమెట్ల మోహన్ రావు, చారి, భూక్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

44వ డివిజన్‌లో ఇందిరమ్మ బీమాపై విస్తృత ఇంటింటి ప్రచారం

- **ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయడమే నా లక్ష్యం**
- **ప్రజల సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తా కాంగ్రెస్ నాయకులు గుడిపూడి జగదీష్**



ఖమ్మం బ్యూరో , నవంబర్23(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఖమ్మం నగరంలోని 44వ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి జగదీష్ ఆధ్వర్యంలో విస్తృత ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు తెలియజేస్తూ, అర్హులైన కుటుంబాలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్, ఖమ్మం అర్బన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా గుడిపూడి జగదీష్ స్వయంగా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రతి ఇంటికి వెళ్లి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. పథకం ఉద్దేశ్యం, ప్రయోజనాలు, అర్హతలు, నమోదు ప్రక్రియ తదితర అంశాలను ప్రజలకు వివరించారు. కుటుంబ పెద్దకు జీవిత భద్రత కల్పించడం ద్వారా ఆపద సమయంలో కుటుంబ సభ్యులకు ఆర్థికంగా అండగా నిలవడమే ఇలాంటి సంక్షేమ పథకాల ప్రధాన ఉద్దేశమని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అర్హులైన కుటుంబాలు తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డులతో 2026 డిసెంబర్ 4వ తేదీ నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు 44వ డివిజన్‌లోని భక్త రామదాసు కళాక్షేత్రం వద్ద సంబంధిత అధికారులకు అవసరమైన పత్రాలు అందజేసి నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి కుటుంబం వినియోగించుకోవాలని, ఎవరూ సమాచారం లేక పథకానికి దూరం కాకూడదనే ఉద్దేశంతో ఇంటింటి ప్రచారం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం గుడిపూడి జగదీష్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, యువ నాయకులు డాక్టర్ తుమ్మల యుగంధర్ ఎల్లప్పుడూ 44వ డివిజన్ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. వారి సూచనలు, సహకారంతో డివిజన్ ప్రజలకు ఉపయోగపడే పలు సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ప్రజాప్రతినిధులు, నాయకులు అప్పగించిన ప్రతి బాధ్యతను ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్వహించడమే తన లక్ష్యమని, ముఖ్యంగా ప్రభుత్వ పథకాలపై ప్రజలకు సరైన అవగాహన కల్పించి అర్హులైన ప్రతి ఒక్కరికీ వాటి ప్రయోజనాలు అందేలా కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి, డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.ప్రజల ఆదరాభిమానాలతో మరింత బాధ్యతగా పనిచేస్తూ సంక్షేమం, అభివృద్ధిలో 44వ డివిజన్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ హుస్సేన్, 44వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాచర్ల తిరుమలరావు, సీ.పీ.ఐ నగర కార్యవర్గ సభ్యుడు దాడి, లంబాడి రాష్ట్ర కార్యదర్శి డుంగ్రోత్ శేఖర్, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు, స్థానిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి చొరవతో గోళ్లపాడుకు కొత్త సొసైటీ..



- **రైతులకు మరింత చేరువలో సేవలు!**
- **వ్యవసాయ సహకార పరపతి సంఘం ఏర్పాటు జీవో విడుదలపై గ్రామస్తుల హర్షం..**
- **క్యాంపు కార్యాలయంలో కృతజ్ఞతలు**

ఖమ్మం బ్యూరో, నవంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడులో నూతన వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో గ్రామ రైతుల చిరకాల ఆకాంక్ష నెరవేరడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం కాంగ్రెస్ పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షులు తోట వీరభద్రం ఆధ్వర్యంలో గోళ్లపాడు గ్రామస్తులు ఖమ్మంలోని మంత్రి క్యాంపు కార్యాలయానికి చేరుకుని... క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించి, మిఠాయిలు పంపిణీ చేశారు. సొసైటీ ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలపాల్సిందిగా కోరారు. గతంలో ఏదులాపురం పరిధిలోని సొసైటీ ద్వారానే రైతులు సేవలు పొందేవారని, ఇప్పుడు ఖమ్మం రూరల్ మండల రైతులకు మరింత చేరువగా గోళ్లపాడులోనే నూతన సొసైటీ ఏర్పాటు కావడం సంతోషంగా ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా తుంబూరు దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. నూతన సొసైటీకి పీఏసీఎస్ కమిటీ ఏర్పాటు చేస్తామని, రైతుల అభ్యున్నతికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో...: మాజీ మార్కెట్ చైర్మన్ మద్ది మల్లారెడ్డి, మద్ది వీరారెడ్డి, ఎల్లారెడ్డి, చంద్రారెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రుద్ర ఉపేందర్, నాయకులు తేజావత్ పంతులు, మాధవరెడ్డి, తొండల రవి, సింగిరెడ్డి బోసురెడ్డి, కృష్ణమూర్తి, కొప్పుల వెంకటేశ్వర్లు, తాళ్లపెల్లి వెంకటేశ్వర్లు, గడ్డమీద ఉపేందర్, బొందల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలి



- **రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి**
- **సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ప్రతినిధుల విజ్ఞప్తి**

హుజురాబాద్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు తిరగమల్ల నాగార్జున కోరారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసి ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలు, వైద్యులు, సిబ్బంది అందుబాటు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ఆసుపత్రి యంత్రాంగంపై ఉందని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితులు అనుకూలించక ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోలేని అనేకమంది నిరుపేదలు ప్రభుత్వ ఆసుపత్రులపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. అలాంటి వారికి నాణ్యమైన వైద్యం అందించడం ప్రభుత్వ ఆసుపత్రుల ప్రధాన బాధ్యత అని స్పష్టం చేశారు.

తిర్యాణి జెడ్పీహెచ్ఎస్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్

- **పాఠశాలలో విద్యా వాతావరణాన్ని పరిశీలించిన కలెక్టర్**

తిర్యాణి, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ తిర్యాణిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. జెడ్పీహెచ్ఎస్ తిర్యాణికి వెళ్లిన కలెక్టర్ అక్కడి విద్యార్థులతో నేరుగా ముచ్చటించారు. పాఠశాల సందర్శనలో భాగంగా విద్యార్థులతో కొంతసేపు గడిపి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో జరిగిన ముఖాముఖిలో వారి చదువులు, పాఠశాల అనుభవాలకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమ అభిప్రాయాలను వెల్లడించేలా వారితో సంభాషించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో నేరుగా మాట్లాడటం ద్వారా వారి ఆలోచనలు, అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు.కలెక్టర్ పాఠశాలకు రావడంతో విద్యార్థులకు జిల్లా ఉన్నతాధికారితో మాట్లాడే అవకాశం లభించింది. సాధారణంగా తరగతి గదుల్లో ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో చదువుకునే విద్యార్థులతో కలెక్టర్ నేరుగా సంభాషించడం ఈ పర్యటనలో ప్రధాన అంశంగా నిలిచింది. విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటూ వారితో ముఖాముఖిగా మాట్లాడారు. పాఠశాల సందర్శనకు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ కార్యాలయం అధికారిక సామాజిక మాధ్యమ ఖాతా ద్వారా వెల్లడించింది. తిర్యాణి జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడిన విషయాన్ని పేర్కొంది. ఈ పర్యటనలో విద్యార్థులతో కలెక్టర్ జరిపిన సంభాషణకు సంబంధించిన సమాచారాన్ని పంచుకుంది.జిల్లా స్థాయిలో విద్యాసంస్థలను సందర్శించడం, విద్యార్థులతో నేరుగా మాట్లాడడం ద్వారా వారి అభిప్రాయాలను తెలుసుకునే అవకాశం అధికారులకు లభిస్తుంది.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
మంగళవారం - 24 - నవంబర్ 2026
వరంగల్ 07





ఇళ్ల స్థలాల కోసం రోడ్డెక్కిన జర్నలిస్టుల ఉద్యమం

- **టీజేఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ**
- **రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వాలి...**
- **420 హామీలతో గద్దెనెక్కి మోసం చేస్తే ఊరుకునేదిలేదు**
- **టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) సంతకాల సేకరణ ఉద్యమంలో బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఫైర్**

ఖమ్మం బ్యూరో , నవంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలోని అర్హులైన ప్రతీ ఒక్క జర్నలిస్టుకూ ఇంటి స్థలం దక్కేవరకూ బీఆర్ ఎస్ అండగా ఉంటుందనీ, ప్రభుత్వం వెంటనే స్పందించి ఖమ్మంలో గతంలో బీఆర్ ఎస్ ప్రభుత్వం కేటాయించిన 23.2 ఎకరాల భూమిని వెంటనే జర్నలిస్టులకు పంపిణీ చేయాలనీ, లేకపోతే తాము జర్నలిస్టుల ఉద్యమంలో కలిసి పోరాడుతామని బీఆర్ఎస్ పార్టీ ఎంపీ రాజ్యసభ ఫ్లోర్‌లీడర్ వద్దిరాజు రవిచంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులుండి కూడా వెయ్యి మంది ఉన్న జర్నలిస్టులకు న్యాయబద్దంగా దక్కాల్సిన ఇంట్ల స్థలాలను పంపిణీ చేయడంలో తాత్సారం చేయడం సరికాదన్నారు. ఖమ్మం జిల్లాలో అర్హులైన ప్రతీ జర్నలిస్టుకూ గత ప్రభుత్వం కేటాయించిన భూమిని పంపిణీ చేయాలంటూ టీయూ డబ్ల్యూజే(టీజేఎఫ్) సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారం అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్వయంగా వచ్చి మద్దతు తెలిపిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ...అమరవీరుల స్తూపం సాక్షిగా ఆందోళన చేస్తున్న టీయయూ డబ్ల్యూజే(టీజేఎఫ్) ఉద్యమం పూర్తిగా చట్టబద్దమైంది, న్యాయమైందన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడేండ్లు అవుతున్నా జర్నలిస్టులకు ఇస్తానన్న భూమిని ఇవ్వకుండా మోసం చేయడం ఎంతవరకు న్యాయమో ముగ్గురు మంత్రులు గుర్తించాలన్నారు. 2023 జనవరి 19న ఖమ్మం జర్నలిస్టులకు ఇంట్ల స్థలాలకు సంబంధించిన జీఓ తీసుకురావడంలో నాడు మంత్రి కేటీఆర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి జీఓ రద్దుకాకుండా చేశామని ఎంపీ గుర్తుచేశారు. ఆ జీఓ ఫలితంగానే స్థల సేకరణ పూర్తయిందన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇంటి స్థలం ఇవ్వాలి...

420 హామీలతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ చివరికి జర్నలిస్టులకు ఇస్తానన్న ఇండ్ల స్థలం పంపిణీ చేయడంలో జర్నలిస్టులను కూడా మోసం చేసిందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1800మంది జర్నలిస్టులు ఉన్నారనీ, రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 44వేల మంది జర్నలిస్టులున్నారనీ వారందరికీ ఒకొక్కరికి 150 గజాల స్థలం ఇచ్చినా మొత్తం కలిపి 1375 ఎకరాలు కేటాయించి పంపిణీ చేస్తే సరిపోతుందన్నారు. అదికూడా దశలవారీగా ప్రతీ ఒక్కరికీ ఇంటి స్థలం కేటాయిస్తే వారికి న్యాయం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఖమ్మం జిల్లాలోని జర్నలిస్టులకు 2023 జనవరి 19న జీఓ నెంబర్ 147 ద్వారా కేటాయించిన భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పంపిణీ చేయడంలేదో సమాధానం చెప్పాలని ఎంపీ వద్దిరాజు ప్రశ్నించారు. బీఆరఎస్ రాజ్యసభ ఫ్లోర్ లీడర్‌గా జర్నలిస్టులకు ఇంట్ల స్థలం దక్కేవరకూ పోరాడుతానని అన్నారు.

ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఇంట్ల స్థలాలు పంపిణీ చేయాలి..

టీయూ డబ్ల్యూజే(టీజేఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి మాట్లాడుతూ..జర్నలిస్టులకు కేటాయించిన భూమిని ఇకనైనా ప్రభుత్వం స్పందించి పంపిణీ చేయాలని జర్నలిస్టులకు అండగా నిలవాలని కోరారు. ఇంట్ల స్థలాలు దక్కేవరకూ దశలవారీ పోరాటాలు కొనసాగుతాయని వారు అన్నారు.

టీజేఎఫ్ నిరసనకు అనూహ్య స్పందన..

ఖమ్మంలో సోమవారం టీజేఎఫ్ నిర్వహించిన సంతకాల సేకరణ ఉద్యమానికి జిల్లా కేంద్రంలో అనూహ్య స్పందన లభించింది. ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖుల నుండి అనూహ్య స్పందన లభించింది. ముఖ్యంగా న్యాయవాదులు, ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు, వైద్యులు, వివిధ సామాజిక సంఘాల ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, యువజన, విద్యార్థి, మహిళా సంఘాలు పెద్ద ఎత్తున వందలాదిగా తరలివచ్చి తమ సంఘీభావం తెలిపారు.టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ నిర్వహిస్తున్న అందోళనలు న్యాయమైన డిమాండ్లు అని వారు అన్నారు. టీజేఎఫ్‌కు తమ సంపూర్ణమైన మద్దతు ఉంటుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, టీజీవో జిల్లా అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీ ఎన్ జీ ఓ స్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాస్, బుల్లెట్ శ్రీను, హాస్టల్ వార్డెన్ల సంఘం జిల్లా అధ్యక్షులు కోటపాటి రుక్మారావు, మహిళా నాయకురాలు కోమలి,
హై కోర్టు న్యాయవాది నలమాస కృష్ణగౌడ్, తెలంగాణ పబ్లికేషన్ అధినేత కోయ చంద్రమోహన్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డా గోంగూర వెంకటేశ్వర్లు, ప్రముఖ న్యూరో వైద్యులు డా. జీ వీ మురళి, సాయిరాం గ్యాస్ట్రో హాస్పిటల్ అధినేత డా జంగాల సునీల్ కుమార్, సీసీఏ ప్రతినిధులు స్పర్శ భాస్కర్, దేవిరెడ్డి విజయ్, డా.బీఆర్ అంబేద్కర్ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షులు లింగాల రవికుమార్, పీడీఎస్‌యూ నేతలు మస్తాన్, లక్ష్మణ్, పీవైఎల్ నేతలు భరత్, కార్మిక సంఘాల నేతలు మోహన్‌రావు, బీఆర్ ఎస్ నేత గౌస్ పాషా, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు మేరుగు వెంకటరమణ, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అమర గాని వెంకన్న గౌడ్, మాలమహానాడు రాష్ట్రనాయకులు గుంతేటి వీరభద్రం, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బానోత్ భద్రూనాయక్, విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు నరేందర్, జంపాల ఈశ్వర్, టీయూసిఐ నేత రామయ్య, గాయకుడు రాము, జర్నలిస్టు యూనియన్ జిల్లా నాయకుడు కల్యాణ్ చక్రవర్తి, టీయూడబ్ల్యూజే(టీజేఎఫ్) జాతీయ కౌన్సిల్ సభ్యులు వెన్నబోయిన సాంబశివరావు ,రాష్ట్ర కమిటీ సభ్యులు బొల్లం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా ఉపాధ్యక్షులు జి. ప్రశాంత్‌రెడ్డి ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రజినీకాంత్, వనం నాగయ్య, కలువకొలను హరీశ్, దుంపల భాస్కర్, రాజ్ న్యూస్ ఉపేందర్,మందుల ఉపేందర్, , శ్రీధర్ శర్మ, వీ5 కేవీ, మోహన్, ఉపేందర్, నగర ప్రధాన కార్యదర్శి అమరవపు కోటేశ్వరరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్‌బాబు, కోశాధికారి బిక్కి గోపి, ఎలక్ట్రానిక్ ఖమ్మం నగర అధ్యక్షులు యలమందల జగదీష్, కరీష అశోక్, కల్యాణ్, సాయి, సంపత్, నాగేశ్వరరావు, సుధాకర్,సతీష్, కెమెరామెన్ల సంఘం నాయకులు రాజు, నాగరాజు, జక్కుల వెంకటరమణ, ఆర్ టి వి శేఖర్, నాగేశ్వరరావు, సతీష్, ముత్యాల కోటేశ్వరరావు,పానకాలరావు,జీవన్ రెడ్డి ,పులి శీను, ఉత్కంఠం శ్రీనివాస్, రేపాక యాదగిరి, హుస్సేన్, బోనగిరి యాదగిరి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు,అప్పారావు కూరపాటి నరేష్, ఉల్లోజు రమేష్, గౌరీ శంకర్, రామకృష్ణ, నాగ శేఖర్ ,నాగేశ్వరరావు,ఐ ఎన్ బి రమేష్ , కెమెరామెన్ శ్రీనివాస్ ,పొదిలి నర్సింహారావు, పాశం వెంకటేశ్వర్లు, మహిళా జర్నలిస్టులు రోజా, కిరణ్మయి, మాధవి, శ్రీదేవి, సంగమేశ్వర ప్రసాద్, మగినం శివకృష్ణ, గణేష్, పెంటి వెంకటేశ్వర్లు, రవి, లింగయ్య, శంకర్ , వెంకన్న, శ్రీను ,తదితరులు పాల్గొన్నారు.

హుజురాబాద్ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఘన సన్మానం



- **నూతన సూపరింటెండెంట్ డాక్టర్ మందల వాసుదేవ రెడ్డికి బీసీ జేఏసీ నాయకుల అభినందనలు**
- **పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి – బీసీ జేఏసీ నాయకులు**

హుజురాబాద్, నవంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు): హుజురాబాద్ ఏరియా ఆసుపత్రికి నూతన సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ మందల వాసుదేవ రెడ్డిని హుజురాబాద్ బీసీ జేఏసీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ చాంబర్‌లో బీసీ జేఏసీ గౌరవాధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, అధ్యక్షుడు సందేల వెంకన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సూపరింటెండెంట్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా బీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ, హుజురాబాద్ ఏరియా ఆసుపత్రికి నూతన సూపరింటెండెంట్‌గా డాక్టర్ మందల వాసుదేవ రెడ్డి బాధ్యతలు స్వీకరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వచ్చే పేద, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో సూపరింటెండెంట్ పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. వైద్య సేవల కోసం ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సత్వర చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలి

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండటమే కాకుండా, నాణ్యమైన చికిత్స కూడా అందాలని నాయకులు సూచించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ రోగులకు మెరుగైన సేవలు అందించేలా సూపరింటెండెంట్ మార్గదర్శకత్వం వహించాలని కోరారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించి, వారి ఆరోగ్య సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు.

మానవసేవే మాధవసేవ అనే భావనతో వైద్య వృత్తిని కొనసాగిస్తూ, ప్రజల ఆరోగ్యమే పరమావధిగా వైద్యులు పనిచేయాలని పేర్కొన్నారు.వైద్యో నారాయణో హరి అనే నానుడిని సార్థకం చేసే విధంగా వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. పేద ప్రజలకు సకాలంలో వైద్యం అందించడం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో మరింత నమ్మకం పెంపొందించవచ్చని తెలిపారు.

రాష్ట్రంలో ఆదర్శ ఆసుపత్రిగా హుజురాబాద్ ఏరియా ఆసుపత్రి ఎదగాలి

డాక్టర్ మందల వాసుదేవ రెడ్డి నాయకత్వంలో హుజురాబాద్ ఏరియా ఆసుపత్రి వైద్య సేవల్లో మరింత అభివృద్ధి సాధించాలని బీసీ జేఏసీ నాయకులు ఆకాంక్షించారు. ఆసుపత్రిలో అవసరమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, రోగులకు మెరుగైన చికిత్స అందించే దిశగా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన ఆసుపత్రిగా హుజురాబాద్ ఏరియా ఆసుపత్రి గుర్తింపు పొందేలా సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బంది సమష్టిగా పనిచేయాలని కోరారు. నూతన సూపరింటెండెంట్‌కు తమ పూర్తి సహకారం ఉంటుందని బీసీ జేఏసీ నాయకులు తెలిపారు. ప్రజలకు న్యాయం జరిగేలా, పేద రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించే విధంగా ఆసుపత్రి యంత్రాంగం పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పరిగెల ప్రసాద్, హుజురాబాద్ మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు వన్నాల శివాజీ, బీసీ జేఏసీ ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, మాజీ ఎంపీటీసీ నరుకుడు సామెల్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సొల్లు బాబు, పంజాల శ్రీనివాస్, కన్నెబోయిన రాజయ్య, ఆర్ఎంపీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. నూతన సూపరింటెండెంట్‌కు శుభాకాంక్షలు తెలిపి, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.





అభివృద్ధి ఎక్కడంటూ.. ఎమ్మెల్యే కడియం శ్రీహరిని నిలదీసిన బీఆర్ఎస్ నాయకుడు నాయిని నరేష్ గౌడ్!

- **హామీలు ఏమయ్యాయి? గ్రామానికి చేసిన అభివృద్ధి ఏదంటూ ప్రశ్నల వర్షం**
- **రూ.1,800 కోట్ల అభివృద్ధి నిధులపై నిలదీత..**
- **ఇందిరమ్మ భీమా ప్రారంభోత్సవంలో వాగ్వాదం.. ఉద్రిక్త వాతావరణం**

జఫర్‌గఢ్,నవంబర్23(తెలంగాణ ముచ్చట్లు): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయి? గ్రామానికి చేసిన అభివృద్ధి ఎక్కడ? నియోజకవర్గానికి రూ.1,800 కోట్లు తీసుకొచ్చామని చెబుతున్న మీరు.. ఆ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులేమిటో ప్రజలకు వివరించాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నాయిని నరేష్ గౌడ్ నిలదీశారు. సోమవారం ఉప్పుగల్ గ్రామంలో జరిగిన ఇందిరమ్మ భీమా పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్న సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామ సమస్యలను ప్రస్తావిస్తూ నాయిని ప్రశ్నించడంతో కార్యక్రమంలో వాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

గత శాసనసభ ఎన్నికల సమయంలో ఉప్పుగల్ గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి అనేక హామీలు ఇచ్చారని, మూడేళ్లు గడుస్తున్నా వాటిలో చాలా వరకు నెరవేరలేదని నాయిని నరేష్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పుగల్ నుంచి రఘునాథపల్లికి వెళ్లే రహదారి పనులు ఇప్పటికీ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. నష్కల్ వరకు బీటీ రోడ్డు నిర్మిస్తామని ఇచ్చిన హామీ ఏమైందని, పెద్ద చెరువులోకి సాగునీరు చేరేందుకు శాశ్వత పరిష్కారం ఎందుకు చూపడం లేదని నిలదీశారు.

15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు మినహా రాష్ట్ర ఆర్థిక సంఘం నుంచి గ్రామానికి ఒక్క రూపాయి కూడా రాలేదని ఆయన ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి రూ.1,800 కోట్లు నిధులు తీసుకొచ్చామని ఎమ్మెల్యే చెబుతున్నప్పటికీ, గ్రామంలో కనీస మౌలిక సదుపాయాల కల్పనలోనే నిర్లక్ష్యం కనిపిస్తోందని విమర్శించారు. కోట్లాది రూపాయల నిధులు తెచ్చినట్లు ప్రచారం చేసుకోవడం కాకుండా, గ్రామానికి జరిగిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చూపించాలని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా తాను గ్రామ సమస్యలను ప్రస్తావిస్తూ ప్రశ్నిస్తుండగా స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తనపై దాడికి ప్రయత్నించారని నాయిని నరేష్ గౌడ్ ఆరోపించారు. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పరిస్థితిని గమనించిన గ్రామ మహిళలు జోక్యం చేసుకుని వారిని అడ్డుకున్నారని, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారని తెలిపారు.

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడగడం తప్పా? గ్రామ సమస్యలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి దాడులకు ప్రయత్నించడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలను ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని చూడటం సరికాదని పేర్కొన్నారు. ఉప్పుగల్ గ్రామానికి ఇచ్చిన హామీల అమలుపై ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టమైన సమాధానం చెప్పాలని, పెండింగ్‌లో ఉన్న రహదారి, సబ్‌స్టేషన్ రోడ్డు, సాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.రూ.1,800 కోట్ల నిధుల వినియోగంపై కూడా స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. గ్రామాభివృద్ధి విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని నాయిని నరేష్ గౌడ్ స్పష్టం చేశారు.

అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

- **ఇద్దరిపై కేసు నమోదు**

వేలేరు నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): హనుమకొండ జిల్లా వేలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పీచర గ్రామంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది మహీంద్రా ద్వారా అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్లు గుర్తించారు.

విచారణలో ట్రాక్టర్ డ్రైవర్, పీచర గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. లింగం బండ సమీపంలోని కాలువ వద్ద ఉన్న మట్టిని అదే గ్రామానికి చెందిన జేసీబీ సహాయంతో గ్రావెల్ లోడ్ చేసి, అధిక ధరలకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడైంది.

దీంతో పోలీసులు ట్రాక్టర్‌తో పాటు గ్రావెల్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ అక్రమ రవాణాలో సంబంధం ఉన్న జేసీబీ యజమాని పరారీలో ఉన్నట్లు తెలిపారు.ఈ ఘటనపై ఇరువురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





ఆధారాలతో నిరూపిస్తాం.. రాజయ్య అభివృద్ధిపై చర్చకు కడియం సిద్ధమా?

- **జీవోలు, శిలాఫలకాలతో సహా అభివృద్ధి లెక్కలు బయటపెడతాం**
- **బహిరంగ చర్చకు సిద్ధమంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి రమేష్ నాయక్,మనోజ్ రెడ్డి సవాల్**

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆధారాలతో సహా నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే కడియం శ్రీహరికి సవాల్ విసిరారు. రాజయ్య హయాంలో జరిగిన అభివృద్ధిని తన ఖాతాలో వేసుకుంటూ మాట్లాడటం సరికాదని, నియోజకవర్గానికి ఎవరు ఏమి చేశారో ప్రజల సమక్షంలో తేల్చుకుందామని స్పష్టం చేశారు.సోమవారం స్టేషన్ ఘన్‌పూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో చిల్పూర్ మండల పార్టీ ఇన్‌చార్జి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ మాలోత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ కేసిరెడ్డి మనోజ్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇటీవల చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గతంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, వాటి వెనుక ఉన్న చరిత్రను వివరించారు.

2004 నుంచి 2023 వరకు డాక్టర్ తాటికొండ రాజయ్య ఎమ్మెల్యేగా, ఉప ముఖ్యమంత్రిగా, ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి చేశారని వారు పేర్కొన్నారు.నియోజకవర్గానికి వైద్య, విద్య, సాగునీటి రంగాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు తీసుకొచ్చిన ఘనత రాజయ్యకే దక్కుతుందని అన్నారు. ముఖ్యంగా 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, జఫర్‌గడ్‌లో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేయడంతో పాటు స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ ఏర్పాటులోనూ కీలక పాత్ర పోషించారని తెలిపారు.

విద్యారంగానికి రాజయ్య హయాంలోనే బలమైన పునాదులు

స్టేషన్ ఘన్‌పూర్‌కు పాలిటెక్నిక్ కళాశాలను తీసుకొచ్చిన ఘనత రాజయ్యదేనని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన కడియం శ్రీహరి పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గానికి డిగ్రీ కళాశాలను తీసుకురాలేకపోయారని విమర్శించారు. విద్యార్థులు ఎన్నోసార్లు ఆందోళనలు చేసినప్పటికీ స్పందించలేదని, డాక్టర్ రాజయ్య మాత్రం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఒప్పించి డిగ్రీ కళాశాలను మంజూరు చేయించారని తెలిపారు.

కస్తూర్బా పాఠశాల, ఆదర్శ పాఠశాల, మైనార్టీ గురుకులం, ఆశ్రమ పాఠశాలలు, జఫర్‌గడ్‌లోని విద్యాసంస్థలు, వెలుగు పాఠశాలల ఏర్పాటు వెనుక రాజయ్య కృషి ఉందన్నారు. నియోజకవర్గంలో విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఆయన అనేక విద్యాసంస్థలను తీసుకొచ్చారని వివరించారు.

మూడేళ్లలో ప్రత్యేకంగా ఎన్ని నిధులు తీసుకొచ్చారు?

కడియం శ్రీహరి పార్టీ మారి కాంగ్రెస్‌లో చేరి మూడేళ్లు కావస్తున్నా నియోజకవర్గానికి ప్రత్యేకంగా ఎన్ని నిధులు తీసుకొచ్చారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. శాసనసభ్యుల నియోజకవర్గ అభివృద్ధి నిధులు సైతం తీసుకొచ్చిన దాఖలాలు కనిపించడం లేదని విమర్శించారు. సమీకృత భవన నిర్మాణాన్ని మాత్రమే రూ.1,400 కోట్ల అభివృద్ధిగా ప్రచారం చేసుకుంటూ భారీగా ప్రకటనలు చేసుకుంటున్నారని, అయితే క్షేత్రస్థాయిలో ప్రజలకు కనిపిస్తున్న అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు.

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలక పదవులు నిర్వహించిన కడియం శ్రీహరి, పదేళ్ల పాలనలో నియోజకవర్గానికి అవసరమైన డిగ్రీ కళాశాల వంటి ప్రాథమిక విద్యాసంస్థను కూడా తీసుకురాలేకపోయారని విమర్శించారు. పార్టీ మారిన తర్వాత నియోజకవర్గ ప్రజలు, తనను గెలిపించిన కార్యకర్తల సమస్యలను పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు.

రాజయ్య మద్దతుతోనే కడియం విజయం

గత శాసనసభ ఎన్నికల్లో కేసీఆర్ గౌరవించి టికెట్ ఇవ్వడంతో పాటు, డాక్టర్ రాజయ్య సూచన మేరకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలంతా ఐక్యంగా పనిచేయడం వల్లే కడియం శ్రీహరి సుమారు 3,500 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారని తెలిపారు. రాజయ్య మద్దతు, బీఆర్ఎస్ శ్రేణుల కృషి లేకుంటే ఆ విజయం సాధ్యమయ్యేది కాదని వ్యాఖ్యానించారు. అలాంటి నాయకుడిపైనే నేడు విమర్శలు చేయడం తగదని హితవు పలికారు.

రూ.104 కోట్ల పంప్‌హౌస్ పనుల్లో 70 శాతం పూర్తి చేసింది గత ప్రభుత్వమే

డాక్టర్ తాటికొండ రాజయ్య, పల్లా రాజేశ్వర్‌రెడ్డి సహకారంతో సుమారు రూ.104 కోట్లతో పంప్‌హౌస్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే దాదాపు 70 శాతం పనులు పూర్తి చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు వెల్లడించారు. అయితే ప్రస్తుత పాలనలో మిగిలిన పనులు నత్తనడకన సాగుతున్నాయని ఆరోపించారు. దీంతో కొండాపూర్, లింగంపల్లి గ్రామాలతో పాటు వేలేరు మండల పరిధిలోని రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

రీ ఎస్టిమేషన్ల పేరుతో గతంలో మంజూరైన పనుల అంచనాలు, ప్రభుత్వ ఉత్తర్వుల్లో మార్పులు చేస్తూ, గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన పనులను తామే తీసుకొచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఆరోపించారు. శిలాఫలకాలను మార్చి అభివృద్ధి పనులపై తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని సూచించారు.

చిల్పూర్ గుట్టకు కేటాయించిన రూ.10 కోట్లు ఏమయ్యాయి?

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చిల్పూర్ గుట్ట దేవస్థానం అభివృద్ధికి రూ.10 కోట్లు కేటాయించామని, ఆ నిధులతో చేపట్టిన పనుల పురోగతి ఏమిటో ప్రస్తుత పాలకులు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. నిధుల వినియోగం, పూర్తయిన పనులు, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను బహిర్గతం చేయాలని కోరారు.

బహిరంగ చర్చకు ఎప్పుడైనా సిద్ధం

నియోజకవర్గంలో గతంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రస్తుత పాలనలో జరిగిన పనులపై తమ వద్ద పూర్తి వివరాలు ఉన్నాయని మాలోత్ రమేష్ నాయక్, కేసిరెడ్డి మనోజ్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు, నిధుల మంజూరు పత్రాలు, శిలాఫలకాలు, పనుల వివరాలతో సహా అన్ని ఆధారాలను ప్రజల ముందుంచడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఎప్పుడు సమయం కేటాయించినా బహిరంగ చర్చకు వస్తామని, వ్యక్తిగత విమర్శలను పక్కనపెట్టి అభివృద్ధిపై చర్చించాలని సవాల్ విసిరారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి ఎవరి హయాంలో ఎంత అభివృద్ధి జరిగింది, ఎవరు ఎన్ని నిధులు తీసుకొచ్చారో ప్రజల సమక్షంలోనే తేల్చుకుందామని వారు స్పష్టం చేశారు.ఈ మీడియా సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాలతో యాదవుల ఐక్యత చాటాలి

- **కాపు–యాదవ సోదరభావం మరింత బలోపేతం కావాలి.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపు.**



కరీంనగర్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): యాదవుల ఐక్యతకు, ఆత్మగౌరవానికి, సంప్రదాయాలకు సదర్ ఉత్సవాలు ప్రతీకగా నిలుస్తున్నాయని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. యాదవుల ఐక్యతను చాటిచెప్పే సదర్ ఉత్సవాలను ప్రతి ఏటా కరీంనగర్ నగరంలో అన్ని కులాలు, వర్గాల ప్రజలను కలుపుకొని అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. యాదవులంటే నమ్మకానికి, ధైర్యసాహసాలకు మారుపేరని కొనియాడారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే మైదానంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో గంగుల కమలాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ నవీన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సదర్ ఉత్సవ ప్రతినిధులతో కలిసి శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొబ్బరికాయ కొట్టి, పూలు సమర్పించి జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నారాయణుడి అవతారమైన శ్రీకృష్ణ భగవానుడి వారసులుగా యాదవులు ఆయన సంప్రదాయాలను కొనసాగిస్తున్నారని అన్నారు. సమాజంలో యాదవులకు ప్రత్యేకమైన నమ్మకం, గౌరవం ఉందని, అన్ని రాజకీయ పార్టీల్లోనూ వారికి సముచిత స్థానం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ యాదవుల ఐక్యతను చాటిచెప్పడం అభినందనీయమన్నారు.

యాదవ–కాపు బంధం మరింత బలపడాలి

మల్లన్న స్వామి యాదవులకు ఇలవేల్పు అని, కాపు సోదరులకు కూడా మల్లన్న స్వామితో విడదీయలేని ఆధ్యాత్మిక అనుబంధం ఉందని గంగుల కమలాకర్ తెలిపారు. మల్లన్న స్వామి సంప్రదాయాలు, పట్నాల నిర్వహణ రెండు వర్గాల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధానికి ప్రతీకలని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో యాదవులు, కాపుల మధ్య కొనసాగుతున్న సోదరభావం మరింత బలోపేతం కావాలని, అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి పండుగలను జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

కరీంనగర్‌లో ఏటా సదర్ సంబరాలు జరగాలి

ఈసారి సదర్ ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ చౌక్‌లో భారీ ర్యాలీ నిర్వహించి, అనంతరం సర్కస్ గ్రౌండ్‌లో కార్యక్రమం ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో కొంత ఆలస్యమైనప్పటికీ అందరికీ అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం పెద్ద సంఖ్యలో పాల్గొనేందుకు అనువైన ప్రాంతంలో ఉత్సవాలు నిర్వహించడం అవసరమన్నారు. దూర ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తే గ్రామీణ ప్రజలు హాజరు కావడానికి ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా కరీంనగర్ నగరంలోనూ అన్ని కులాలు, వర్గాల ప్రజలను భాగస్వాములను చేస్తూ సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఇందుకోసం తనవంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. యాదవ సోదరులందరూ ఐక్యంగా ఉంటూ తమ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని కోరారు. సదర్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించిన యాదవ సోదరులందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నవీన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సదర్ ఉత్సవ ప్రతినిధులు, యాదవ సంఘాల నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్షా స్ఫూర్తితో దీక్షా దివస్ సభను చారిత్రాత్మకంగా నిర్వహించాలి



- **నవంబర్ 29న భారీగా తరలిరావాలి. ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, అందరూ మా కుటుంబ సభ్యులే: మాజీ మంత్రి గంగుల,ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్**

కరీంనగర్, నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమ చరిత్రలోనే కీలక మలుపుగా నిలిచిందని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. నవంబర్ 29న నిర్వహించనున్న దీక్షా దివస్ సభను చారిత్రాత్మకంగా నిర్వహించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అధ్యక్షతన సోమవారం కరీంనగర్ జిల్లా గాంధీనగర్ చింతకుంటలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి దీక్షా దివస్ సభ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ ఏర్పాట్లు, కరీంనగర్ నియోజకవర్గం నుంచి భారీగా జన సమీకరణ, పార్టీ శ్రేణుల భాగస్వామ్యంపై ఇరువురు నేతలు దిశానిర్దేశం చేశారు.

ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం.. అందరూ మా కుటుంబ సభ్యులే

ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ పార్టీలో చిన్నా పెద్దా అనే తేడా లేదని, ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం, ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. శరీరంలో ప్రతి అవయవం ఎంత ముఖ్యమో పార్టీలో ప్రతి నాయకుడు, కార్యకర్త కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. ఏ ఒక్క చిన్న అవయవం పనిచేయకపోయినా శరీర వ్యవస్థ మొత్తం దెబ్బతింటుందని, అదే విధంగా పార్టీలో ఏ ఒక్క కార్యకర్తను నిర్లక్ష్యం చేయడానికి వీల్లేదని వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ తన కుటుంబ సభ్యులేనని, పార్టీ బాధ్యతలను కుటుంబ బాధ్యతగా భావించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కరీంనగర్ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని, భవిష్యత్తులోనూ ఇదే ఐక్యతతో ముందుకు సాగాలని కోరారు.

కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ ఉద్యమానికి కీలక మలుపు

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన పోరాటాన్ని గంగుల కమలాకర్ గుర్తుచేశారు. దశాబ్దాలుగా తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమాలు చేసినప్పటికీ రాష్ట్ర ఏర్పాటు ఆలస్యమైందన్నారు. 2009 నవంబర్ 29న కరీంనగర్ గడ్డపై కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమ చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందని పేర్కొన్నారు. ఆ దీక్షతో తెలంగాణవ్యాప్తంగా ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిందని, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమంలో భాగస్వాములయ్యారని తెలిపారు. కేసీఆర్ దీక్ష ఫలితంగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు.

కరీంనగర్ అభివృద్ధికి కేసీఆర్ ప్రత్యేక ప్రాధాన్యత

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కరీంనగర్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని గంగుల కమలాకర్ అన్నారు. గతంలో నిధుల కొరతతో అభివృద్ధికి నోచుకోని నగరానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. నగర రూపురేఖలు మారేలా పలు పనులు చేపట్టి కరీంనగర్‌ను అభివృద్ధి తెలంగాణ అభివృద్ధిలో దేశానికే ఆదర్శం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, తలసరి ఆదాయంలో దేశంలోనే అగ్రస్థానానికి చేరుకుందని అన్నారు. తెలంగాణ తలసరి ఆదాయం సుమారు రూ.4.20 లక్షలకు చేరుకోవడం రాష్ట్ర ప్రగతికి నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి గురించి మాట్లాడే ముందు బీజేపీ పాలిత రాష్ట్రాల పరిస్థితిని పరిశీలించాలని సూచించారు.తెలంగాణ ఎన్నికల సమయంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి రాష్ట్రానికి వచ్చి అభివృద్ధి నేర్చుకోవాలంటే ఉత్తరప్రదేశ్‌ను చూడాలని చెప్పారని గుర్తుచేశారు. అయితే ఉత్తరప్రదేశ్ తలసరి ఆదాయం తెలంగాణతో పోలిస్తే చాలా తక్కువగా ఉందన్నారు. మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లోనూ తలసరి ఆదాయం ఆశించిన స్థాయిలో లేదని, గుజరాత్‌లో సైతం తెలంగాణ కంటే తక్కువగా ఉందని విమర్శించారు. దీర్ఘకాలంగా అధికారంలో ఉన్నప్పటికీ ఆయా రాష్ట్రాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని అన్నారు.

ప్రజా సమస్యలపై బీజేపీ నేతలు స్పందించాలి

కరీంనగర్ అభివృద్ధి గురించి మాట్లాడే బీజేపీ నాయకులు ముందుగా ప్రజలకు సంబంధించిన సమస్యలపై దృష్టి సారించాలని డాక్టర్ సంజయ్ సూచించారు. రైల్వే పైవంతెన నిర్మాణం వంటి పనులను సైతం సకాలంలో పూర్తిచేయలేని పరిస్థితిపై ప్రశ్నించారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ విమర్శలు, పాదయాత్రలతో కాలం గడపడం సరికాదన్నారు.రైతులకు సాగునీరు, విద్యుత్ సమస్యలు, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, విద్యార్థుల భవిష్యత్తు వంటి అంశాలపై బీజేపీ నాయకులు పోరాటం చేయాలని సూచించారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, హక్కులు, ప్రయోజనాల విషయంలో కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు.

సామాజిక మాధ్యమాల్లో యువత చురుగ్గా ఉండాలి

పార్టీ శ్రేణులు, యువత సామాజిక మాధ్యమాల్లో మరింత చురుగ్గా వ్యవహరించాలని డాక్టర్ సంజయ్ పిలుపునిచ్చారు. ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. యువతను పార్టీకి మరింత చేరువ చేయడంతో పాటు వారి సమస్యలను తెలుసుకొని అండగా నిలవాలని అన్నారు నవంబర్ 29న నిర్వహించనున్న దీక్షా దివస్ సభకు కరీంనగర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి డివిజన్ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేలా సమన్వయంతో పనిచేయాలని గంగుల కమలాకర్, డాక్టర్ సంజయ్ పిలుపునిచ్చారు. కేసీఆర్ చేసిన పోరాటాన్ని, తెలంగాణ సాధన కోసం చేసిన త్యాగాలను భావితరాలకు తెలియజేసేలా దీక్షా దివస్ సభను ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల బాధ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,
Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in